# తొలివార్త
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com



best deal HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)



ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ | సంపుటి : 02 | సంచిక : 167 | శుక్రవారం 23 - 10 - 2026 | వెల : 4/- | పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


## జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వందేళ్లలో ఎవరూ చేయని పని తమ ప్రభుత్వం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు
- ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని పునరుద్ఘాటించారు
- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 22 :**

పేదల పక్షాన నిలబడి, దొరల దోపిడీని ఎదిరించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని ప్రకటించారు. వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. నిజాం పాలనలో భూస్వాములు, దొరలు పేదల భూములను ఆక్రమిస్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పండుగ సాయన్న అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా సాయన్న నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు ధాన్యం పంచడంతో పాటు పేద ఆడబిడ్డలు వివాహాలకు ఆర్థిక సాయం చేసిన ఘనత సాయన్నదని కొనియాడారు. అన్యాయంగా హత్యకు గురైనప్పటికీ వందేళ్లు దాటినా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని - మిగతా 2 లో

## మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే 'అలయ్ బలయ్'



- అలయ్ బలయ్ సమ్మేళనం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఘనంగా జరిగింది
- వివిధ పార్టీల నేతలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు
- అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , మంత్రి పొన్నం ప్రభాకర్

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 22 :**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వేదికగా అలయ్ బలయ్ దసరా సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. భారతీయ సాంస్కృతిక ఔన్నత్య పునరుద్ధరణ - మిగతా 2 లో



## గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

- నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్
- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న ఎంపీ అర్వింద్
- గడ్డం పెంచితే కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరంటూ వ్యంగ్యాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు చర్చలు జరుగుతున్నాయి

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 22 :**

నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం - మిగతా 2 లో

## ప్రకృతితో ఘర్షణ వద్దు విపత్తులను తప్పించలేం

- 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు
- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తల ప్రశంస



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 22 :**

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, - మిగతా 2 లో

## పోలాండ్ ప్రధానితో మోదీ ద్వైపాక్షిక చర్చలు



- భారత్- ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొత్త అవకాశాలు
- పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 22 :**

భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్- పోలాండ్ భాగస్వామ్యానికి కొత్త అవకాశాలను సృష్టించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భారతదేశం పెరుగుతున్న ఆర్థిక బలాన్ని, గత రెండేళ్లుగా ద్వైపాక్షిక సంబంధాల్లో నెలకొన్న వేగాన్ని ప్రస్తావించారు. విశ్వసనీయమైన ప్రపంచ సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడానికి, 2030 నాటికి తమ ఉమ్మడి ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని సాధించడానికి - మిగతా 2 లో



## తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- వరంగల్ రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం చేయడానికి డిసెంబర్‌లో ప్రధాని మోదీ తెలంగాణకు రానున్నారు

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 22 :**

తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ స్పష్టం చేసింది. వరంగల్‌లో రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా - మిగతా 2 లో

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు షెడ్యూల్



- ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు థియరీ పరీక్షల నిర్వహణ
- ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్, ఫిబ్రవరి 25 నుంచి సెకండియర్ పరీక్షలు
- ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు
- ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని బోర్డు వెల్లడి
- పండుగలు, సెలవులను బట్టి తుది షెడ్యూల్‌లో మార్పులకు అవకాశం

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 22 :**

ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. - మిగతా 2 లో



## ఏపీకి మరో తుపాను ముప్పు!

- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా
- తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 22 :**

బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం - మిగతా 2 లో

## ఎంత వరకైనా పోరాడదాం



- వైసీపీ అధినేత జగన్
- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 22 :**

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ - మిగతా 2 లో

## సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ స్థానిక ఎన్నికలపై చర్చ

- సీఎం చంద్రబాబు నివాసానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెళ్లారు
- స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కీలకంగా చర్చించారు
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ
- కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 22 :**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ చోటుచేసుకుంటున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలకంగా చర్చించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు, ఎన్నికల వాయిదా నేపథ్యంలో తాజా పరిస్థితులు, కూటమి పార్టీల్లో రెబల్ అభ్యర్థుల వ్యవహారంపై ఇరువురు నేతలు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నెలకొన్న పరిస్థితులపైనా చర్చించినట్లు తెలిసింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా విడుదలను నిలిపివేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న మార్పులు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయం, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధానంపైనా చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపికతో పాటు రెబల్ అభ్యర్థుల పోటీ అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయావకాశాలు, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నట్లు - మిగతా 2 లో

# సంపాదకీయం

## కలల ప్రపంచాన్ని కూల్చిన బ్లాక్ థర్స్‌డే



1920వ దశకంలో అమెరికా వీధుల్లో కొత్త వెలుగులు విరబూశాయి. పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందాయి, రోడ్లపై కొత్త కార్లు పరుగులు తీశాయి, రేడియోలు ఇళ్లలోకి చేరాయి. ఈ కాలాన్ని చరిత్రలో 'రోరింగ్ ట్వెంటీస్' అని పిలుస్తారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా... ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా మారింది. ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చు అని బలంగా నమ్మారు.బడా వ్యాపారవేత్తల నుండి పారిశుద్ధ్య కార్మికుల వరకు తమ పొదుపు మొత్తాలను వాల్ స్ట్రీట్ షేర్ మార్కెట్లోకి గుమ్మరించారు. కంపెనీల నిజమైన విలువ ఎంత; వాటి ఉత్పత్తి, లాభాలు ఎంత అనే ప్రాథమిక సూత్రాలను పెట్టుబడిదారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. కేవలం ధర పెరుగు తోందనే ఏకైక కారణంతో షేర్లను కొనడం ప్రారంభించారు. ఈ విధంగా మార్కెట్లో ఒక భారీ ఊహాజనిత బుడగ (స్పెక్యులేటివ్ బబుల్) రూపుదిద్దుకుంది.ఆ కాలంలో మార్కెట్‌ను ముంచెత్తిన అతిపెద్ద ముప్పు 'అప్పు (మార్జిన్ మనీ)తో షేర్లు కొనడం'. పెట్టుబడిదారుడు తన సొంత డబ్బు కేవలం 10 శాతం నుండి 20 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన 80 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని బ్రోకర్ల నుండి అప్పు తీసుకునేవాడు. మార్కెట్ పెరుగుతున్నంత కాలం ఈ విధానం అద్భుతమైన లాభాలను తెచ్చిపెట్టినట్లు కనిపించింది.అయితే షేర్ ధరలు కొద్దిగా తగ్గినా, బ్రోకర్లు అదనపు మార్జిన్ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చేవారు. అదనపు నగదు చెల్లించలేని పరిస్థితుల్లో, బ్రోకర్లు ఆ షేర్లను బలవంతంగా మార్కెట్లో అమ్మకానికి పెట్టేవారు. ఇది మార్కెట్ పతనాన్ని మరింత వేగవంతం చేసే విధ్వంసకర చక్రంగా మారింది. అదే సమయంలో అమెరికా పరిశ్రమల్లో అవసరానికి మించి ఉత్పత్తులు పేరుకుపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచడం క్రెడిట్ లభ్యతను మరింత తగ్గించింది.1929 అక్టోబర్ 24, గురువారం న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో కొద్ది నిమిషాల్లోనే వాల్ స్ట్రీట్ వాతావరణం భయాందోళనలతో అల్లకల్లోలంగా మారింది. పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న షేర్లను వదిలించుకోవడానికి పోటీపడ్డారు. ఆ ఒక్క రోజే దాదాపు 1.29 కోట్ల షేర్లు అమ్ముడయ్యాయి. బ్యాంకర్ల బృందం రంగంలోకి దిగి, మార్కెట్‌ను ఆదుకోవడానికి భారీగా షేర్లను కొనుగోలు చేయడంతో పతనం తాత్కాలికంగా ఆగింది. కానీ అక్టోబర్ 28 సోమవారం (బ్లాక్ మండే) డౌ జోన్స్ సూచీ 12.8 శాతం కూలిపోయింది. మరుసటి రోజు అక్టోబర్ 29న 'బ్లాక్ ట్యూస్డే' నాడు 1.6 కోట్లకు పైగా షేర్లు చేతులు మారాయి. దిగ్గజ కంపెనీల షేర్ల విలువలు పాతాళానికి పడిపోయాయి. సెప్టెంబర్ 3న 381 పాయింట్ల వద్ద ఉన్న డౌ జోన్స్ సూచీ 1932 జూలై నాటికి 41 పాయింట్లకు పడిపోయింది. ఏకంగా 89 శాతం ఆస్తి తుడిచి పెట్టుకుపోయింది.స్టాక్ మార్కెట్ సంక్షోభం క్రమంగా సామాన్యుడి జీవితాన్నీ తీవ్రంగా కుదిపివేసింది. కంపెనీల విలువ తగ్గిపోవడంతో పరిశ్ర మలు మూతపడ్డాయి, ఉద్యోగుల తొలగింపు మొదలైంది. 1933 నాటికి అమెరికాలోని ప్రతి ఐదు బ్యాంకుల్లో ఒకటి దివాళా తీసింది. 1932 నాటికి దేశంలో ప్రతి నలుగురు కార్మికులలో ఒకరు నిరుద్యోగిగా మారారు. కాగితాలు, రేకులతో వెలసిన అసంఖ్యాక తాత్కాలిక నివాసాలు నాటి మహా మాంద్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి.ఈ ఆర్థిక పతనం 'గ్రేట్ డిప్రెషన్ 'గా రూపాంతరం చెంది ప్రపంచ దేశాలను చుట్టుముట్టింది. 'గోల్డ్ స్టాండర్డ్' ద్వారా సంక్షోభం ఇతర ఖండాలకు విస్తరించింది. జర్మనీలో ఏర్పడిన తీవ్ర నిరుద్యోగం అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీ అధికారంలోకి రావడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించింది.నాటి బ్లాక్ థర్స్‌డే ఘటన నేటి ఆర్థిక ప్రపంచానికి విలువైన పాఠాలను అందిస్తోంది. కేవలం ధర పెరుగుతోందనే ఒక్క కారణంతో ఆస్తికి విపరీతమైన విలువ ఉందనుకోవడం పెద్ద భ్రమ. మార్జిన్ తో పెట్టుబడి పెట్టడం లాభాలను పెంచినట్లే, నష్టాల సమయాల్లో సర్వస్వం ఊడ్చేస్తుంది. జ్ఞానం కంటే భయం, అత్యాశ మాత్రమే మార్కెట్లను నడిపేటట్లయితే తీవ్రమైన విపత్తులు తప్పవు.

## సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ స్థానిక ఎన్నికలపై చర్చ

**మొదటిపేజీ తరువాయి** - తెలిసింది. అయితే సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారిక ప్రకటన వెలువడలేదు.గురువారం సీఎం చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. ఎలాంటి భద్రతా సిబ్బంది, కాన్వాయ్ లేకుండా ఒంటరిగా వచ్చిన ఆయన ముఖ్యమంత్రితో కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది.

## ఎంత వరకైనా పోరాడదాం

**మొదటిపేజీ తరువాయి** - జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

## ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

**మొదటిపేజీ తరువాయి** - సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు.'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు షెడ్యూల్

**మొదటిపేజీ తరువాయి** - ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి.వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది.అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏపీకి మరో తుపాను ముప్పు!

**మొదటిపేజీ తరువాయి** - చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళా ఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగు ండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు.ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

# పోలాండ్ ప్రధానితో మోదీ ద్వైపాక్షిక చర్చలు

**మొదటిపేజీ తరువాయి** - భారత్, పోలాండ్ కలిసి పనిచేస్తాయన్నారు."పోలాండ్ ప్రధానికి స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. 2024లో నేను పోలాండ్‌లో పర్యటించినప్పుడు ఆయన నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికారు. ఆ పర్యటనలో ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించాం. ఈ బలమైన పునాదిపై, గత రెండేళ్లుగా మా భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంది. ఈరోజు పోలాండ్? ప్రధానితో జరిగిన సమావేశంలో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. భారతదేశం, పోలాండ్ మధ్య స్నేహం కేవలం దౌత్య సంబంధాలపై మాత్రమే కాకుండా మానవత్వం, కరుణ అనే ఉమ్మడి వారసత్వంపై కూడా ఆధారపడి ఉంది. మన పెరుగుతున్న ఆర్థిక బలం భారత్-పోలాండ్ భాగస్వా మ్యానికి కొత్త అవకాశాలను సృష్టించింది. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ అవకాశాలను మరింత విస్తృతం చేసింది."ప్రపంచం నేడు అనిశ్చితి, మార్పుల గుండా వెళుతోంది. ఇలాంటి సమయంలో భారత్- పోలాండ్ వృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలకు ముఖ్యమైన కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్నాయి. పోలాండ్ జీడీపీ 1 ట్రిలియన్ డాలర్ల చారిత్రాత్మక మైలురాయిని దాటింది. అందుకు ప్రధాని టస్క్‌ను నేను అభినందిస్తున్నాను. గత త్రైమాసికంలో భారత్ కూడా 7.8 శాతం అద్భుతమైన వృద్ధి రేటును నమోదు చేసింది. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక బలం భారత్- పోలాండ్ భాగస్వామ్యానికి కొత్త అవకాశాలను అందిస్తోంది. భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ అవకాశాలను మరింత బలోపేతం చేసింది. ప్రధాన మంత్రి టస్క్? ఒక పెద్ద వ్యాపార ప్రతినిధి బృందాన్ని తీసుకురావడం నాకు ప్రత్యేకంగా సంతోషంగా ఉంది. ప్రపంచం కోసం విశ్వసనీయమైన సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడానికి ఇరు దేశాల కంపెనీలు కలిసి పనిచేస్తాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం అనే మన ఉమ్మడి లక్ష్యాన్ని కూడా సాకారం చేసుకుంటాయని మేము విశ్వసిస్తున్నాం అని ప్రధాని మోదీ అన్నారు.భారత్- ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో పోలాండ్‌కు యంత్రాలు, రసాయనాలు,ప్లాస్టిక్‌లు,ఇంజినీరింగ్ వస్తువుల భారతీయ ఎగుమ తులకు కొత్త అవకాశాలు లభిస్తాయన్నారు. అదే సమయంలో అధునాతన తయారీ, ఆహార శుద్ధి, బయోటెక్నాలజీ, రైల్వేలు, రవాణా వంటి రంగాలు కొత్త పోలిష్ పెట్టుబడులను ఆకర్షిస్తాయని తెలిపారు. రక్షణ, అంతరిక్ష, ఇంధన రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి భారత్- పోలాండ్ అంగీకరిం చాయని చెప్పారు. "రక్షణ, అంతరిక్ష, ఇంధన రంగాల్లో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ రోజు మనం అంగీకరించాం.ఈ వ్యూహాత్మక రంగాలన్నింటిలోనూ భారత్‌తో కలిసి సహ-అభివృద్ధి, సహ-ఉత్పత్తిలో పాలుపం చుకోవాలని పోలిష్ కంపెనీలను మేము ఆహ్వానిస్తున్నాం. కీలక ఖనిజాలు, బొగ్గు వాయు వుగా మార్చే ప్రక్రియల్లో పోలాండ్‌కు ఉన్న నైపుణ్యాన్ని ఉపయో గించుకుని, మేము కొత్త భాగస్వామ్యాలను కూడా ఏర్పరుస్తాం." అని ప్రధాని మోదీ అన్నారు.అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఇండియా-పోలాండ్ స్టార్టప్ బ్రిడ్జ్‌ను, ఇరు దేశాల యువత కోసం టెక్నాలజీ హ్యాకథాన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. "ఐటీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో మా సంబంధం ఇప్పటికే బలంగా ఉంది. అనేక భారతీయ ఐటీ కంపెనీలు పోలాండ్‌లో పనిచేస్తున్నాయి. ఈ సహకా రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ ఇండియా-పోలాండ్ స్టార్టప్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడానికి మేము అంగీకరించాం. మన రెండు దేశాల యువత కోసం టెక్నాలజీ హ్యాకథాన్‌లను కూడా నిర్వహి స్తాం." అని ప్రధాని మోదీ అన్నారు.

## తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి** - తెలుస్తోంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ఫోకస్ చేసినట్లుగా కనిపిస్తోంది.హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావులు పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నేతలు కూడా ఉన్నారు.ముఖ్యనేతల సమావేశంలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనుంది. సర్‌పై కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు చేస్తున్న రాద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి, గుంపు సామ్యాన్ని ఓడించండి" అంటూ తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు పిలుపునిచ్చారు. దేశాన్ని బీజేపీ మాత్రమే రక్షిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

**మొదటిపేజీ తరువాయి** -

పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

# జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం



**మొదటిపేజీ తరువాయి** - సీఎం అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు.బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం చేపట్టిందని రేవంత్ రెడ్డి చెప్పారు. కులగణన కారణంగానే వివిధ కులాలు తమ జనాభా, హక్కులపై బలంగా గళం వినిపిస్తున్నాయని తెలిపారు. లెక్కల్లో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి వివరాలు అందిస్తే సవరిస్తామని స్పష్టం చేశారు.ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని సీఎం వెల్లడించారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ఇతర కులాల్లో ఉన్న అపోహలను కూడా తొలగించాల్సి ఉందన్నారు. గతంలో శ్రీహరి ముదిరాజ్‌కు డీసీసీ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశామని నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు."జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం. వందేళ్లలో ఎవరూ చేయని పని మా ప్రభుత్వం పూర్తి చేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. ఎంతమంది ఉన్నారో తెలిసింది కనుకే మీ గళానికి విలువ పెరిగింది. బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. గతంలో జరిగిన తప్పు మరోసారి జరగకుండా చూడాలి. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు.ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచించారు. ప్రభుత్వంలో ముదిరాజులను భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మరోవైపు, గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరింత విస్తృతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. బీసీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి అధ్యయనం చేయిస్తామన్నారు. ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే 'అలయ్ బలయ్'



**మొదటిపేజీ తరువాయి** - యజ్ఞంలో భాగంగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మధ్య ఏకాత్మతాభావం నెలకొల్పే లక్ష్యంతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించారు.నషా ముక్తా భారత్ లక్ష్యంతో నిర్వహించిన ఆలయ్ బలయ్ సమ్మేళనానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు వీహెచ్, కె.కేశవరావు, జానారెడ్డితో పాటు బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు హాజరయ్యారు.బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉదయం 11 గంటలకు శమీ పూజతో అలయ్ బలయ్ ప్రారంభం కాగా అంతకు ముందు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలైన ఆత్మీయుల అలయ్ బలయ్ ఆలింగనాలు, షడ్రుచుల సమ్మేళనం, ఒగ్గుడోలు తాళాల మోత, జొన్నకర్రల జోరు, జమిడిక వాద్యాల హోరు, ఆడబిడ్డల కోలాటాలు, బతుకమ్మ, బోనాలు, గొబ్బెమ్మలు, గౌరమ్మలు, భజన కీర్తనలు, ఢమరుక నాదాలు, డప్పు విన్యాసాలు, చిందు యక్షగానాలు, ఒగ్గు కథలు, సన్నాయి వాద్యాలు ఆలయ్ బలయ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే అలయ్ బలయ్ అని వెంకయ్యనాయుడు తెలిపారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆలోచనకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో మనందరి లక్ష్యం కావాలన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ అనేది కులమతాలకు రాజకీయాలకు ప్రాంతాలకు అతీతమైన వేదికన్నారు. ఆలయ్ బలయ్‌లో తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు, వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి."కుల,మత,ప్రాంతాలకు అతీతంగా జరుపుకునేదే అలయ్ బలయ్. రాష్ట్రాన్ని, దేశాన్ని వికసితం వైపు తీసుకెళ్లాలి. ఆకలి, దప్పికలు లేని దేశంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలి. మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే అలయ్ బలయ్. 2005 నుంచి బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారు. వివిధ మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు రాజకీయాలు పక్కన పెట్టి మానవత్వాన్ని పెంపొందించేందుకే అలయ్ బలయ్ దోహదపడుతుంది. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాన్ని కాపాడుకోవాలి.దసరా వచ్చిందంటే మనకు గుర్తుకు వచ్చేది అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సెక్యులర్ దేశంలో ఏ మతాన్ని, ఏ పండగను తక్కువ చేసి చూడకూడదని హితవు పలికారు.పంజాబ్ ప్రజల తరపున, తన తరుపున దత్తాత్రేయకు అభినందనలు తెలుపుతున్నట్లు పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా తెలిపారు. 2005 నుంచి అలయ్ బలయ్?ను విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కుల, మత ప్రాంతాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. 'నషా ముక్తి భారత్' అనేది మన ముందున్న లక్ష్యమన్నారు. పంజాబ్?లో అది తన బాధ్యత అని చెప్పారు. తెలంగాణలో బతుకమ్మ, బోనాలు ఎంతో విశిష్టమైన పండగలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకుంటూ జరుపుకునే పండగలని కొనియాడారు. విజయదశమి మరుసటి రోజు అలయ్ బలయ్ నిర్వహించి వివిధ మనస్తత్వాలు ఉన్న మనుషులను ఏకతాటిపైకి మామూలు విషయం కాదన్నారు.కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా అలయ్ బలయ్ జరుపుకుంటున్నామని మాజీమంత్రి జానారెడ్డి తెలిపారు. అలయ్ బలయ్ నిర్వహిస్తున్న బండారు దత్తాత్రేయకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ వేదిక కాదు.. సిద్ధాంతాల వేదిక కాదు.. మానవత్వాన్ని పెంచే వేదిక అలయ్ బలయ్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. అందరం కలిసి ఉంటేనే దేశం ముందుకు వెళ్తుందన్నారు. చెడు పైన మంచి సాధించడం అనే ఉద్దేశ్యంతో దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారన్నారు."ప్రధాని మోదీ ఆలోచనకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో మనందరి లక్ష్యం కావాలి. నషా ముక్త్ భారత్, వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. అలయ్ బలయ్ అనేది కులమతాలకు రాజకీయాలకు ప్రాంతాలకు అతీతమైన వేదిక" - బండారు దత్తాత్రేయ, మాజీ గవర్నర్తెలంగాణ అంటే సుక్క ముక్క కాదని, ఆత్మ గౌరవం, అన్యాయం ఎదుర్కోవడమని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ బండారు విజయలక్ష్మీ తెలిపారు. తెలంగాణ డప్పులలో విన్యాసం, వంటకాలలో ఉన్న రుచి ఎక్కడా కనిపించదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మీ అందరి సహకారంతో అలయ్ బలయ్ విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.సద్ద అప్పలు, జొన్న రొట్టెలు, మక్కగారెలు, మలీదముద్దలు, యాటవేపుడు, కోడిపులుసు, పొట్టురొయ్యలు, సర్వపిండి, ఎండుచేపలు, డబల్ రోటి, బోటి, దాల్చా, పచ్చిపులుసు, నల్ల, సల్ల, సల్లచారు, చింతతొక్కు, ముంత శనగలు, గుడాలు, మురుమురాలు, అటుకులు, చుడువా, గరంగరం మసాలాలు, సకినాలు, భక్షాలు ఇలా ఎన్నెన్నో తెలంగాణ వంటకాలు అతిథులకు రుచులను పంచాయి.తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి చాటిచెప్పేలా బండారు దత్తాత్రేయ ఆలయ్ బలయ్ సమ్మేళనాన్ని 2005లో ప్రారంభించారు. రెండు దశాబ్దాలుగా ప్రతి ఏటా దసరా మరుసటి లేదా ఆ మరుసటి రోజు ఆలయ్ బలయ్ సమ్మేళనాన్ని అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా అంతే ఘనంగా నిర్వహించారు.

## జంగిలి సుగుణమ్మ కుటుంబానికి
# ఆర్థిక సాయం 5, వేలు అందజేసిన

**బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి సర్పంచ్ మర్రి సంధ్య**



**అశ్వాపురం అక్టోబర్ 22 ( తొలివార్త ):** మొండికుంట గ్రామంలో జంగిలి వెంకన్న, రాజేందర్ ల మాతృమూర్తి జంగిలి సుగుణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందినది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండల, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ,స్థానిక,నాయకులతో ,కలిసి, వారి నివాసానికి వెళ్లి, వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన మొండికుంట గ్రామ,సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి... ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు జాలే రామకృష్ణారెడ్డి, మరియు వార్డు సభ్యులు పసుల స్వరూప, పాటి మన్మధ రెడ్డి, రామగిరి భాస్కర్, వెంగళ బిక్షం రెడ్డి, పసుల లింగయ్య,బొడ్డోజు రామాచారి, అంబటి కర్ర శ్రీను మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అభ్యర్థి గెలుపు కోసం ఎంఎల్సి ఎన్నికలకు
# కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

**డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** ఎం.ఎల్.సి. ఓటర్లను నమోదు చేయించేలా కృషి చేయాలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలి,ఖమ్మం ఎం.పి. రఘు రాంరెడ్డిని, ఎం.ఎల్.సి. అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని సన్మానించిన కొత్వాల,ఎం.ఎల్.సి. ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు, సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి,గెలుపుకు కృషి చేయాలని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, అన్నారు. కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం లో ఎం.ఎల్.సి, ఎన్నికల సమయాత్త సమావేశం ఏర్పాటుచేశారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డిసిసి అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల,మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాయకత్వంలో 75 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఎం.ఎల్.సి ఎన్నికలకు గాను కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్ల నమోదులో చురుగ్గా పాల్గొనాలని కొత్వాల, అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

## సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదానం





**వలిగొండ, అక్టోబర్ 22 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాయిబాబా ఆశీస్సులతో భక్తులకు, అవసరమైన వారికి అన్నదానం చేస్తూ సేవా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. సాయిబాబా ట్రస్టు అధ్యక్షుడు గౌరిశెట్టి అశోక్, కార్యదర్శి పంజాల రమేష్, కోశాధికారి చీకటి మల్ల వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నువ్వుల శ్రీనివాస్‌తో పాటు పలువురు దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ అన్నదాన సేవలో భాగస్వాములవుతున్నారు. అన్నదానం మహాదానమనే భావనతో ప్రతి గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా సేవాభావాన్ని చాటుతున్నారు. భక్తి, మానవత్వం, సేవా స్ఫూర్తితో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో దాతృత్వ భావన పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యతనిస్తున్నారు. సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమానికి దాతలు తమ సహకారాన్ని అందిస్తూ, అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు తోడ్పడుతున్నారు.

## కొమురం భీమ్ జయంతి వేడుక
# సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేసిన

**గొంది గూడెం కొత్తూరు సర్పంచ్ కోండ్రు అంజమ్మ**





**అశ్వాపురం అక్టోబర్ 22 ( తొలివార్త ):** గొంది గూడెం కొత్తూరు గ్రామపంచాయతీలో గురువారం నాడు,రైతు తన పొలంలో పని చేయడానికి వచ్చిన కూలీలకు,కొమురం భీమ్ జయంతి వేడుక సందర్భంగా తన ఇంటి ఆడబిడ్డలుగా భావించి, తనవంతుగా సహాయం అందించాలని ఉద్దేశంతో మహిళలకు చీరలు,కొనుగోలు చేసి,స్థానిక సర్పంచ్ కొండ్రు అంజమ్మ చేతుల మీదుగా ఆడ బిడ్డలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం, గొంది గూడెం కొత్తూరు గ్రామంలో, ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో,కొమురం భీమ్, జయంతి వేడుకలు,ఘనంగా నిర్వహించారు.ఆదివాసి ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాలలో జరిపిన,జయంతి వేడుక సందర్భంగా మాన్యం వీరుడు,ఆదివాసీల,ముద్దుబిడ్డ,ఆదివాసి హక్కులపై తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు, కొమురం భీమ్, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించిన, గొందిగూడెం కొత్తూరు,సర్పంచ్ కొండ్రు అంజమ్మ,ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది గ్రామ పెద్దలు, కొమరం పెద్ద గంగరాజు వెంకటాచారి, సురేష్, కోండ్రు రామచంద్రయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై రాజేష్ కి ఫిర్యాదు పత్రం అందజేసిన

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** అశ్వాపురం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్,లో ఎస్సై రాజేష్, కి పిర్యాదు, పత్రం అందజేసిన బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు, ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు నాయకులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి వారు ఇరువురు మాట్లాడుతు విజయదశమి పర్వదినాన ఎన్ ఎస్ యు ఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు కొత్తగూడెంలో ప్రధాని నరేంద్ర మోదీ ని రావణాసూరిడితో పోల్చుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, సిఎస్ జ్ఞానేష్ కుమార్ ఫొటోలతో దిష్టి బొమ్మ దహనంచేసి సోషల్ మీడియాలో పోస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని పైన ఇలాంటి చర్యలు చేపట్టడం,ప్రజల,మనోభావాలను దెబ్బతీయడమేనని అని బాలరాజు పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన అజ్మీర సురేష్ నాయక్ మరియు ఇతర నాయకులపై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు నాయకత్వంలో సంబంధిత ఫిర్యాదు,ను, అశ్వాపురం ఎస్ఐ రాజేష్, కి, అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొల్లులింగారెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు గోసుల రాములు గిరిజన మోర్చా జిల్లా కార్యవర్గ సభ్య లు సున్నం సారయ్య సారయ్య ఓబీసీ మోర్చాజిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గాదె శ్రీకాంత్ మండల నాయకులు బండ్ల నాగేశ్వరరావు కోలా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న

**అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**భద్రాద్రి జిల్లా, అక్టోబర్ 22 ( తొలివార్త ):** దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో గురువారం నాడు, తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన రాజకీయ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు,సామాజిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ తన అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార, సామాజిక రంగాల ప్రముఖులు ఒకే వేదికపై సమావేశమైన ఈ సెమినార్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అభిప్రాయాలను పంచుకునేందుకు వేదికగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అభివృద్ధి అవకాశాలు, వెనుకబడిన ప్రాంతాల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు, యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే మార్గాలు వంటి అంశాలపై చర్చలు జరిగాయి.గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత,తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అక్కడి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వంటి గిరిజన జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, రవాణా వంటి మౌలిక సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను సెమినార్‌లో ప్రస్తావించారు. గిరిజన ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం, విద్యా, వైద్య సేవలు మరింత చేరువ కావడం, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలైతే స్థానిక ప్రజలకు మెరుగైన జీవన అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరడంతో పాటు, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం ద్వారా అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంటుంది.పారిశ్రామిక పెట్టుబడులతో ప్రాంతీయ అభివృద్ధి,పారిశ్రామిక పెట్టుబడులు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పన కూడా ప్రాంతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం అవసరం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాంతాలకు అనుగుణంగా పారిశ్రామిక, వ్యాపార అవకాశాలను విస్తరించడం ద్వారా స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించడం వంటి చర్యలు ప్రాంతీయ పురోగతికి దోహదపడతాయి.ఈ అంశాల నేపథ్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వివిధ రాష్ట్రాల నుంచి,వచ్చిన,పారిశ్రామికవేత్తలు, వ్యాపార రంగ ప్రముఖులతో కలిసి పెట్టుబడులు, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు,గిరిజన యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడం సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించడం, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా యువత భవిష్యత్తుకు బాటలు వేయవచ్చు.గిరిజన ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరిగితే జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గే అవకాశం ఉంటుంది. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చు. ఈ నేపథ్యంలో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన అంశాలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రాధాన్యతనిస్తూ తన అభిప్రాయాలను వెల్లడించారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడం ద్వారా గిరిజన యువత ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని ఈ అంశం ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

**వివిధ రంగాల ప్రముఖులతో అభిప్రాయాల మార్పిడి**

ఢిల్లీలో నిర్వహించిన ఈ సెమినార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొనడంతో పలు రంగాలకు సంబంధించిన అంశాలపై అభిప్రాయాల మార్పిడికి అవకాశం ఏర్పడింది. అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలను వివిధ కోణాల్లో చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడింది.అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఈ సెమినార్‌లో పాల్గొని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

# ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించిన అధికారులు

**నీటి పొదుపు పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి గ్రామసభలో సూచన**



**వలిగొండ అక్టోబర్ 22 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అక్కంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, నీటి వనరుల సంరక్షణ, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని, తక్కువ నీటితో పండించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ గ్రామసభకు జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావాల కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉందని, వర్షపాతం తగ్గడం వంటి పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపవచ్చని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యవసాయ నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.

**తక్కువ నీటితో పండించే పంటలపై దృష్టి సారించాలి**

వాతావరణ మార్పుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడినప్పుడు పంటలకు నష్టం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. గ్రామసభలో పాల్గొన్న రైతులు కూడా వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటల వివరాలు, నీటి వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై చర్చించారు. అధికారులు, రైతుల మధ్య జరిగిన పరస్పర చర్చలతో గ్రామసభ ఆసక్తికరంగా సాగింది.

**నీటి సంరక్షణతో పాటు గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యత**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడే వీబీ-జీ రామ్ జీ పథకం గురించి అధికారులు గ్రామస్థులకు వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టడం వల్ల వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా సోక్ పిట్స్ (నీటి ఇంకుడు గుంతలు) నిర్మాణం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అవకాశం కలుగుతుందని, తద్వారా భూగర్భ జలాల పెంపునకు తోడ్పడుతుందని వివరించారు. ఇలాంటి నీటి సంరక్షణ పనులు గ్రామంలో నీటి లభ్యతను మెరుగుపరచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పనకు కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా భాగస్వాములు కావాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం**

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశిరెడ్డి వేణుగోపాల్, ఉప సర్పంచ్ నిమ్మల కృష్ణ, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) స్వప్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి, గ్రామ రైతులు, ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచవచ్చని ఈ గ్రామసభ ద్వారా అధికారులు వివరించారు. వ్యవసాయ నష్టాలను తగ్గించడంతో పాటు నీటి సంరక్షణ, ఉపాధి కల్పన, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సమగ్ర అభివృద్ధిని సాధించడమే గ్రామసభ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** చర్ల దుమ్ముగూడెం శాశ్వత కరువు మండలాలుగా ప్రకటించాలి. సిపిఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి మధు చర్లలో ప్రదర్శన,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ను కరువు ప్రాంతంగా ప్రకటించాలని అందులో పూర్తి ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల దుమ్ముగూడెం ను శాశ్వత కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఆవునూరి,మధు,పిలుపునిచ్చారు. గురువారం నాడు, చర్ల లో జరిగిన ప్రదర్శనలు వారు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 70% వర్షాలు పడలేదని దీనితో పంటలు వేయలేదని, వేసిన పంటలు కూడా పండలేదని, వేసిన పంటలకు కరెంటు సరిగలేక నీరు అందక నిండిపోయాయని వారన్నారు. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన చర్ల దుమ్ము కూడా కరువు ప్రాంతంగా ప్రకటించాలని వారు అన్నారు. కరువు ప్రాంతంలో పనులు లేక ఇబ్బంది పడుతున్న ఆదివాసీల శ్రమను గుర్తించకుండా వారి పేరు మీద సొసైటీలు చేయించుకొని ఇసుక అక్రమ దందా నిర్వహిస్తున్న గిరిజన ఇతరులపై కూడా చర్యలు తీసుకోవాలని వారన్నారు ఇక్కడ ఇసుకను ఆదివాసీలకు అప్పజెప్పి కాలంగాక అనిల్ లేక ఇబ్బంది పడుతున్న ఆదివాసులకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు.రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఇక్కడ ఆదివాసీలు మొత్తం కూడా సాగు చేసుకుంటున్న భూమి మొత్తం కూడా ఆదివాసీల దేనని దానిమీద ఫారెస్ట్ వాళ్ల అక్రమ కేసులు పెట్టడం అరెస్టులు చేయడం లాంటివి మానుకోవాలని ఆయన అన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు మొదటి డిపిఆర్ నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి ఎకరాకు అందించాలని చెప్పి అనేకసార్లు మంత్రులని అధికారులను కోరిన ఫలితం లేదని దాని ఫలితమే ఈ రోజు తాగునీరు సాగునీరు కరువైందని కళాపన గోదావరి ఉన్న పంటలు పండగ తాగడం నీరు లేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వచ్చిందని వారు అన్నారు కావున ఈ పరిస్థితిలో సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు తక్షణమే ఈ సమస్యల పరిష్కారం కోసం జరిగే ఆందోళనలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు తక్షణమే అధికారులు స్పందించి మండలాలను సర్వే చేసి జిల్లాలో ఉన్నటువంటి కరువు పరిస్థితి అంచనా వేసి జిల్లాను మరియు శాశ్వతంగా చర్ల దుమ్ముగూడెం ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరావు భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మండల కార్యదర్శి సంతపురి సురేష్ దుమ్ముగూడెం మండల కార్యదర్శి జోగారావు నాయకులు గొంది మూయన్న,మట్ట నరసింహారావు, చిలకమ్మ,జానకి, రామకృష్ణ, ప్రసాదు, కొండ స్వామి, అబ్బురం,సోనూ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ వీరుడు కొమరం భీం జయంతి వేడుక విగ్రహావిష్కరణలో పాల్గొన్న

**మంత్రి ధనసరి సీతక్క,ఎస్టీ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** దుమ్ముగూడెం మండల పరిధిలోని, ములకపాడు, గ్రామం నందు వై జంక్షన్ వద్ద ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ జిల్లా చైర్మన్ చందా లింగయ్య దొర, తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం కొమరం భీం చేసిన పోరాటం చిరస్మరణీయం: మంత్రి సీతక్క,ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం ప్రతిపత్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడు కొమరం భీం అని కొనియాడారు. "జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో ఆదివాసీలకు నీరు, అడవి, భూమిపై హక్కులు ఉండాలని ఆయన సాగించిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా గిరిజన సమాజ హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగం, చూపిన ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.కొమరం భీం ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీ సమాజ అభ్యున్నతికి కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేయాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి వంటి మౌలిక అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆదివాసీ యువత విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందుకు సాగాలని, తమ హక్కులపై,అవగాహన,పెంపొందించుకోవాలని సూచించారు. కొమరం భీం పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ, ఆదివాసీల గౌరవప్రదమైన జీవనానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొమరం భీం ఆశయాల సాధనకు కృషి చేస్తాం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన కొమరం భీం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజం ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. "జల్, జంగల్, జమీన్" నినాదం ఆదివాసీల హక్కులు, వారి జీవన విధానం, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు.కొమరం భీం ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. గిరిజనుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, వారసత్వాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, కొమరం భీం చరిత్రను,భావితరాలకు, తెలియజేయాలని,పిలుపునిచ్చారు. ఆదివాసీల అభ్యున్నతి, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, కొమరం భీం ఆశయాల సాధనకు కట్టుబడి ఉంటామని తెలిపారు.ఆదివాసీ వారసత్వ పరిరక్షణకు పిలుపు కొమరం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివాసీ సమాజంలో ఐక్యతను, ఆత్మగౌరవాన్ని మరింత బలోపేతం చేసే కార్యక్రమంగా నిలిచింది. ఆయన పోరాట చరిత్రను స్మరించుకుంటూ, ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనేం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు తుడుం దెబ్బ నాయకులు, మహిళా సోదరీమణులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
www.epaper.tolivaartha.com



# వైరా సొసైటీ చైర్మన్ పీఠం దాసరి దానియేలుకు దొక్కేనా !

**బిఆర్ఎస్ హయాంలోనూ కాంగ్రెస్ కోసం పోరాటం.**

**ఓటమి ఎదురైన పార్టీని వేయడమే క్రమశిక్షణ కలిగిన నేత!**

**నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు సమస్త ప్రాధాన్యత ఇచ్చేనా ?**

**సీనియర్ దళిత నాయకుడికి అవకాశం కల్పించాలని దళిత సంఘాల డిమాండ్.**



**వైరా అక్టోబర్ 22 ( తొలివార్త ):** పదవులు ఆశించి పార్టీలు మారే నాయకులు ఎందరో... అధికారం ఉన్న లేకపోయినా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసే నాయకులు కొందరే ! అలాంటి నాయకుల్లో దాసరి దానియేలు ఒకరని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ నే నమ్ముకుని రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైన పార్టీని వేడకుండా కొనసాగుతున్న ఆయనకు ఎప్పటికైనా సముచిత గుర్తింపు దక్కాలని డిమాండ్ వైరాలో వినిపిస్తుంది. వైరా సొసైటీ చైర్మన్ పదవిని సీనియర్ దళిత నాయకుడైన దాసరి దానియేలుకు కేటాయించాలని దళిత సంఘాలు దళిత నాయకుడు కోరుతున్నారు.

**బిఆర్ఎస్ హయాం లోను వెనక్కి తగ్గని నేత!**

బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వైరా జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు నాయకులు ఆసక్తి చూపని పరిస్థితిలో దాసరి దానియేలు ముందుకు వచ్చారని ఆయన అనుచరులు గుర్తు చేస్తున్నారు. పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని భావించి తన భార్యను ఎన్నికల బరిలో నిలిపి అప్పటి అధికార పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున పోటీ చేయించారు. ఆయనేకల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైన పార్టీని వీ డకుండా కాంగ్రెస్ లోనే కొనసాగారు. పదవుల కోసం కాకుండా పార్టీ కోసం నిలబడటమే తన రాజకీయ నిబద్ధతకు నిదర్శనమని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

**చిన్ననాటి నుంచి కాంగ్రెస్ తోనే ప్రయాణం.**

దాసరి దానియేలు తన చిన్ననాటి నుంచే కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కొనసాగిస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందాలని ఆయన అనుచరులు పేర్కొన్నారు. 1995లో వార్డు మెంబర్గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన 2010-2012 మధ్య జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. 2013 నుంచి స్టేట్ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించారు. 20 21 లో రెబ్బవరం సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాయకులు కార్యకర్తలు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు సాగారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. పార్టీ కష్టకాలంలోనూ క్రమశిక్షణతో వ్యవహరించడం పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండటం ఆయన రాజకీయ ప్రయాణంలో ప్రత్యేకతగా పేర్కొంటున్నారు.

**పదవులు ఖాళీ ఆశావాహుల్లో చర్చ.**

వైరా సొసైటీ చైర్మన్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవుల భర్తీ అంశం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయంగా మారింది. ఈ నేపథ్యంలో వైరా సొసైటీ చైర్మన్ పదవికి దాసరి దానియేలు పేరును పరిశీలించాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం పార్టీ పట్ల విధేయత ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తించి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏళ్లు తరబడి పార్టీ కోసం పనిచేసిన నాయకులకు గుర్తింపు లభించకపోతే కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణుల్లోని కొందరు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కష్ట కాలంలో అండగాలి ఇచ్చిన నాయకులను పదవుల కేటాయింపులో విస్మరించకూడదని వారు కోరుతున్నారు.

**ఎస్సీలకు నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించరా ?**

ఖమ్మం జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు గణనీయ సంఖ్యలో ఉన్నప్పటికీ నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని దళిత సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. సామాజిక న్యాయం సమాన అవకాశాల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పదవుల కేటాయింపులోనూ అదే స్ఫూర్తిని చాటాలని వారు కోరుతున్నారు. పార్టీ కష్ట కాలంలోనూ కాంగ్రెస్ను వేడకుండా పనిచేసిన సీనియర్ దళిత నాయకుడు దాసరి దానియేలుకు ఇప్పుడు అవకాశం కల్పించకపోతే మరి ఎప్పుడు కల్పిస్తారు ? అని ఆయన మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యతను ఇస్తూ వైరా సొసైటీ చైర్మన్ పదవిని దాసరి దానియేలుకు కేటాయించాలని దళిత సంఘాలు దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**అధిష్టానం నిర్ణయం పై ఆసక్తి.**

మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్తో కొనసాగుతున్న దాసరి దానియేలు సేవలను గుర్తించి సామాజిక న్యాయం దిశగా ఆయనకు అవకాశం కల్పించాలని ఆయన మద్దతుదారులు కోరుతున్నారు. వైరా సొసైటీ చైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? సీనియర్ దళిత నాయకుడి అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయంగా మారింది.

# సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాబిన్‌హుడ్**

**174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**





**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు. పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరగకుండా చూడాలి

**లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలి**

**బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు**



**హైదరాబాద్ అక్టోబర్ 22 ( తొలివార్త ):** డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలను అరికట్టి పారదర్శకంగా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతూ హైదరాబాద్ మహా నగర పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు గురువారం తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీ.పి.గౌతమ్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్బీనగర్, కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్ గిరి, ఉప్పల్, మహేశ్వరం, అంబర్ పేట నియోజకవర్గాల శాసనసభ్యులు ఆయా ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో చోటు చేసుకున్న అక్రమాలను వీపీ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో నిజమైన పేదలకు కాకుండా మంత్రులు, అధికారుల సిఫారసుల ఆధారంగా ఎలాంటి లాటరీ పద్ధతి లేకుండా ఇష్టరాజ్యంగా కేటాయిస్తున్నా విషయం ఆధారాలతో చూపించారు. అదేవిధంగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇష్టరాజ్యానికి ఇందిరమ్మ కమిటీలకు ఎంపిక ప్రక్రియను వదిలివేయడం ద్వారా నిజమైన పేదలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. నిజమైన పేదలకు దక్కాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అక్రమార్కులకు, అడ్డదారిలో కేటాయింపులు జరిపితే సహించేది లేదని గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో సెక్రటేరియట్ ముట్టడిస్తామని ఎల్బీనగర్ శాసనసభ్యుడు సుధీర్ రెడ్డి గారు హెచ్చరించారు. ఎకార్యక్రమలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావులి**



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 22 ( తొలివార్త ):జిల్లా ప్రతినిధి** గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న సమాజంలోని పేదలు, బలహీన వర్గాల ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన జీవితం, పోరాట స్ఫూర్తి, సమాజం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

## ఊటుకూరి రంజిత్ కళ్యాణి దంపతులు



**కొనిజర్ల అక్టోబర్ 22 ( తొలివార్త ):**పెద్దగోపతి గ్రామపంచాయతీకి చెందిన ఉత్తమాల కిట్టయ్య కుమార్తెల ఓణీల వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊటుకూరి రంజిత్ కళ్యాణి దంపతులు. చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల శుభకార్యాలలో సంతోష సమయాలలో భాగస్వామ్యాలు అవుతూ ఆప్యాయతలు పంచుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలతో మమేకమైతు ప్రతి కుటుంబం సంతోషంలో భాగస్వామ్యం అవుతున్న యువ నాయకుడు ఊటుకూరి రంజిత్ అని స్థానికంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయ వివక్షతకు

## తావు లేకుండా పారదర్శకత పాటించాలి

**వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి.**





**ఖమ్మం అక్టోబర్ 22 ( తొలివార్త ):** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలపై ఖమ్మం కలెక్టరేట్ వద్ద బిఆర్ఎస్ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అఖిలపక్ష ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల హక్కు రాజకీయ సిఫార్సులతో ఇచ్చే బహుమానం కాదు. పేదవాడికి సొంత ఇల్లు అనేది కనీస అవసరమని రాజకీయ జోక్యానికి వివక్షతకు తావు లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి డిమాండ్ చేశారు. గ్రామ సభల నిర్ణయాలను గౌరవించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అర్హుల జాబితాను బహిరంగంగా ప్రకటించాలని అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. మేరకు అఖిలపక్ష నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించి లబ్ధిదారుల ఎంపికలు వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేయాలని కోరారు.

# మల్కాపూర్ లో వివాహిత దారుణ హత్య

**భర్త,అత్తమామలే నిందితులు**



**చౌటుప్పల్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ప్రియాంక మాల్ (26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.

**మృతురాలి వివరాలు:**

భర్త పేరు: పరాస్ మాల్ నివాసం:మల్కాపూర్ గ్రామం,చౌటుప్పల్ మండలం స్వస్థలం: సోమేసరా నయా గ్రామం,బార్మేర్ జిల్లా,రాజస్థాన్

**ఘటన వివరాలు:**

తేదీ 21-10-2026 రాత్రి సమయంలో భర్త మరియు అత్తమామలు ప్రియాంక మాల్ పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 22-10-2026 ఉదయం 10:15 గంటలకు మృతి చెందారు.

**పోలీసుల చర్యలు:**

గ్రామపంచాయతీ సెక్రటరీ జ్యోతి ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## భౌరంపేట్ నుంచి శబరిమలకు

## గోనె రామిరెడ్డి గురుస్వామి పాదయాత్ర



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 22 ( తొలివార్త ):ప్రతి నిధి.** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామానికి చెందిన గోనె రామిరెడ్డి గురుస్వామి ఈరోజు కేరళలోని శబరిమల అయ్యప్ప సన్నిధానానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అయ్యప్ప భక్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి గురుస్వామిని సన్మానించి, పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో గురుస్వామి యాత్ర సాఫీగా సాగాలని ప్రార్థించారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల

## సమన్వయ సమావేశంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి.



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 22 ( తొలివార్త ):ప్రతి నిధి.** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు శంషాబాద్ లోని మల్లిక కన్వెన్షన్ లో ఉమ్మడి మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలోనిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా నియమితులైన జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యులు లక్ష్మీకాంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార వ్యూహాలు, పట్టభద్రుల ఓటర్లను సమన్వయం చేయడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, పట్టభద్రుల ఓటర్లను కలిసి పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జులు, డీసీసీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి,ఎస్టి ఎన్ ఎస్ యు ఐ,ఐ ఎన్ టి యు సి విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నాయకులు



**తుర్కపల్లి, అక్టోబర్ 22 ( తొలివార్త ):** తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన దుగ్యాల సత్తెమ్మ మరణించడంతో ఆమె కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. గురువారం ఆమె దశదిన కర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పెండెం రవి, కుటుంబ సభ్యులు దుగ్యాల వెంకటేశ్వర్లు, దుగ్యాల పాండురంగం, జర్నలిస్టు తునికి శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు

## డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి



**తుర్కపల్లి అక్టోబర్ 22 ( తొలివార్త ):** కాలేశ్వరం ఎత్తిపోతల పథకం ప్యాకేజీ 16 లో భాగంగా మంజూరైన ఓటీ వన్ డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వెంకటాపురం గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, గుజ్జవాని కుంట తండా సర్పంచ్ గుగులోతు ధూప్ సింగ్ నాయక్ ,వేల్పుపల్లి సర్పంచ్ సిద్దులు కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్ కి వినతి పత్రాన్ని అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుర్కపల్లి మండల పరిధిలోని వెంకటాపురం, గుజ్జవానికుంట తండా, వేల్పు పల్లి మల్లాపురం తదితర గ్రామాల పరిసర ప్రాంత రైతులకు ఈ కాల్వ ద్వారా అందే అవకాశం ఉందని అన్నారు .కాల్వ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీని ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కాల్వ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల్లోని వందలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించడంతోపాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కాలువ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్టు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు

## డి జే ఫౌండేషన్ పరివారం ఆత్మీయ సమ్మేళనం డి జే పరివార్

# కుటుంబం చెల్లెలు 150 మంది తో దసరా సంబరాలు



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** డీజే ఫౌండేషన్ కుటుంబం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. దసరా పండగ సంవత్సరానికి ఒకసారి వస్తుందని అందరూ కలిసిమెలిసి ఉండి ఆత్మీయ సమ్మేళనం కుటుంబ సభ్యులందరితో దసరా నిర్వహించుకున్నారు. సభ్యులకు హ్యాపీ దసరా నిన్న సాయంత్రం ఎమ్మార్ గార్డెన్ లో డీజే పరివార్ సమ్మేళనం నిర్వహించుకున్న ము ఇట్టి కార్యక్రమంలో డీజే పరివార్కు సంబంధించిన సిస్టర్స్ 150 మందితో దసరా సంబరాలు కార్యక్రమం నిర్వహించుకున్నా ము ఈ సందర్భంగా అందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని డిజె శివదాస్ చెప్పడం జరిగింది ఆయన 97 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా డి జే పరివార్ కుటుంబ సభ్యులందరూ ఆయనను ఘనంగా సన్మానించారు. రోటి క్లబ్ మాజీ అధ్యక్షులు అలాగే జీ స్వాతి గుజరాతి, నివేదన్ గీత, ప్రేమ్ కిరణ్ కుటుంబ సభ్యులందరూ పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినారు. డిజె సులోచన సమాజ్ సీనియర్ అయినటువంటి అమ్మ కూడా చాలా విషయాలు చెప్పడం జరిగింది. అందరూ స్త్రీలు పురుషులు కలిసి మెలిసి ఉండాలి మీ యొక్క స్నేహం ఉండాలని మీరంతా మంచి ఉండాలని కూడా ఆమె తెలియజేశారు.

## శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయంలో దుర్గాదేవి నిమజ్జనం

**ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) కార్యదర్శి డీకే రాజేష్ కార్యవర్గ సభ్యులు**



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయంలో నవరాత్రి పురస్కరించుకుని దుర్గాదేవి నిమజ్జనం భారీ ఎత్తున ప్రజలు భక్తులు అధిక సంఖ్య వచ్చి దర్శనానికి పాల్గొన్నారు. మరియు దాండియా కార్యక్రమం లో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 1000 మంది ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ మహిళలు మరియు సభ్యులు ఘనంగా నిర్వహించారు. రాత్రి శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయం నుండి పది గంటల నుండి రాత్రి మూడు గంటలకు దాండియా గోల్ బంగ్లా వద్ద నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చి దేవి నవరాత్రి నిమజ్జనం నిర్వహించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ ఇన్‌ఛార్జీల నియామకం

**భువనగిరి నియోజకవర్గానికి కర్నె ప్రభాకర్ నియామకం**



**చౌటుప్పల్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతోంది. నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జీలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఇందులో భాగంగా భువనగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ను నియమించారు. భువనగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కి పార్టీ శ్రేణులు,నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయంలో దుర్గాదేవి నిమజ్జనం

**ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ సీనియర్ (న్యాయవాది) కార్యదర్శి డీకే రాజేష్ కార్యవర్గ సభ్యులు**



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయంలో నవరాత్రి పురస్కరించుకుని దుర్గాదేవి నిమజ్జనం భారీ ఎత్తున ప్రజలు భక్తులు అధిక సంఖ్య వచ్చి దర్శనానికి పాల్గొన్నారు. మరియు దాండియా కార్యక్రమం లో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 1000 మంది ఎస్ ఎస్ కె క్షత్రియ సమాజ్ మహిళలు మరియు సభ్యులు ఘనంగా నిర్వహించారు. రాత్రి శ్రీ దత్తాత్రేయ లక్ష్మీనారాయణ ఆలయం నుండి పది గంటల నుండి రాత్రి మూడు గంటలకు దాండియా గోల్ బంగ్లా వద్ద నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చి దేవి నవరాత్రి నిమజ్జనం నిర్వహించారు.

## చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ తండ్రి దశదిన

# కర్మలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు





**చౌటుప్పల్, అక్టోబర్ 22 ( తొలివార్త ):** చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ తండ్రి నందగిరి పెంటయ్య దశదిన కర్మ కార్యక్రమం చౌటుప్పల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని పెంటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ ఈదుదుల మస్తాన్ బాబు యాదవ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్,మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డితదితరులు పాల్గొన్నారు. అనంతరం పెంటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,పార్టీలో వివిధ హోదాలో ఉన్న నాయకులు,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు,స్థానిక ప్రముఖులు,తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్ ఆదివాసి నగర్‌లో కోటి వ్యయం తో

## సీసీ రోడ్లు సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

**ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 22 ( తొలివార్త ):** మణుగూరు మండల పరిధిలో ఉన్న సుందరయ్య నగర్, ఆదివాసి నగర్ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గం, ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా ఆయా కాలనీల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి పారుదలకు సంబంధించిన సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సుందరయ్య నగర్, ఆదివాసి నగర్ ప్రాంతాల్లో చేపట్టనున్న ఈ పనులతో స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజా నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలి

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపు**



**మణుగూరు, అక్టోబర్ 22 ( తొలివార్త ):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సన్నాహాలను పటిష్ఠం చేయాలని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకోవాలని, నియోజకవర్గంలోని పట్టభద్రులను నేరుగా కలిసి వారి సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు, ఓటు హక్కుపై అవగాహన, ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించిన సీనియర్ నాయకుడని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసి ప్రజాజీవితంలో తనదైన గుర్తింపు పొందారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవను గుర్తుచేసుకుంటూ, ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలు, విద్యావంతుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లను కలవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ఎన్నికల ప్రచారాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేయాలని పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు రామసహాయం రఘురామ్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పినపాక నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళ నాయకురాలు, జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయం.

**మరి బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించరా..?**

**కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలి**

**గవర్నర్ కోటాలో భర్తీ చేసే నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి**

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ అక్టోబర్ 22 ( తొలివార్త ):** తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను స్మరించుకోవడం అభినందనీయమని,అయితే బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు కేవలం మహనీయుల విగ్రహాలు, జయంతి ఉత్సవాలకే పరిమితం కాకుండా, పాలనలోనూ నిర్ణయాధికారంలోనూ సముచితమైన భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలి. బీసీల జనాభా దామాషా, సామాజిక న్యాయం ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీ నాయకులకు అవకాశం కల్పించి,బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తక్కువ నీటిని వినియోగించే పంటల సాగుకు ప్రాధాన్యతనివ్వాలి



**తుర్కపల్లి, అక్టోబర్ 22 ( తొలివార్త ):** తక్కువ నీటిని వినియోగించే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత నివ్వాలని డి ఆర్ డి ఓ నాగిరెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం ధర్మారం ,గొల్లగూడెం, రామోజీ నాయక్ తండా, పల్లెపహాడ్ గ్రామాల్లో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావాల వల్ల ప్రజల దైనందిన జీవనంపై వ్యవసాయ రంగంపై ప్రజల సాగు విధానాలపై కలిగే ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులు వర్షపాతం తగ్గే అవకాశాలు పంటకు కలిగే నష్టాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటిని వినియోగించే పంటలకు సాగు ప్రాధాన్యత నివారణ అందుబాటులో ఉన్న నీటి వణులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. గ్రామ సభలో రైతులు చురుగ్గా పాల్గొని తక్కువ నీటితో సాగు చేయగల పంటల గురించి తమ అభిప్రాయాలను సూచనలను తెలియజేశారు సూచనలను తెలియజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు గ్రామ అభివృద్ధికి తోడ్పడే విబి జీరామ్ జి పథకం గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామంలో నీటి విలువ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నీటి ఇంకుడు గుంతలు నిర్మించడం వంటి పనులను చేపట్టడం వల్ల వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసి పట్టుకోవచ్చని భూగర్భ జలాల పెంపునకు తోడ్పడడంతో పాటు గ్రామస్తులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి ,తాసిల్దార్ రవికుమార్ ,ఎం పి ఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎం డి అల్తాఫ్, గ్రామ రైతులు పాల్గొన్నారు

# బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం 3 రోజులపాటు భారీ వర్షాలు

**ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. ఈ ఆవర్తనం పశ్చిమ- వాయువ్య దిశగా కదిలి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతం, అండమాన్ దీవుల మీదుగా కేంద్రీకృతమైందని వాతావరణ శాఖ తెలిపింది.**



ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. ఈ ఆవర్తనం పశ్చిమ- వాయువ్య దిశగా కదిలి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతం, అండమాన్ దీవుల మీదుగా కేంద్రీకృతమైందని దీని ప్రభావంతో రేపు ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**ఈదురుగాలులు వీచే అవకాశం :**

ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఏపీ, కర్ణాటక, కేరళలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం నేపథ్యంలో వాతావరణశాఖ కోస్తాంధ్రకు ఇవాళ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**బంగాళాఖాతంలో అల్పపీడనం :**

అండమాన్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కేంద్రీకృతమై ఉండగా దీని ప్రభావంతో రేపటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఆది, సోమవారాల్లో వాయుగుండంగా రూపాంతరం చెందుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఆ తరువాత 2-3 రోజుల్లో మరింత బలపడి కోస్తాంధ్ర తీరానికి సమీపంలోకి చేరే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో ఈ నెల 25న రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో సోమవారం నుంచి మూడు రోజులు అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం నుంచి మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని వేటకు వెళ్లిన మత్స్యకారులు ఈ లోపు తీరానికి తిరిగి రావాలని హెచ్చరించారు. రేపు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**రోడ్లన్నీ జలమయం :**

ఎల్‌నినో ప్రభావంతో కడప నగరం వేసవి కాలాన్ని తలపించింది. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడగా మరోవైపు వర్షాలు కురవక రైతులు అగచాట్లు పడ్డారు. కరువు తప్పదనుకుంటున్న సమయంలో కడపలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

తొలివార్త

శుక్రవారం 23 - 10 - 2026

# దేవరగట్టు కర్రల సమరంలో చిందిన రక్తం

**ఒకరు మృతి, 100 మందికి పైగా గాయాలు**

**ఏపీలోని కర్నూలు జిల్లా దేవరగట్టులో 'బన్ని' పండుగ సందర్భంగా హింస చెలరేగింది**

**ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా దేవరగట్టులో 'బన్ని' ఉత్సవం సందర్భంగా హింస చెలరేగింది. కర్రల సమరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా నిర్వహించే బన్నీ ఉత్సవం రణ రంగాన్ని తలపించింది. శోభాయాత్ర జరుగుతున్న సమయంలో అర్ధరాత్రి దాటాక ఈ హింస చెలరేగింది. గ్రామస్తులు ఒకరిపై ఒకరు కక్షపూరితంగా రాళ్లు, కర్రలు, దివిటీలతో తలపడడంతో సుమారు వందమందికి పైగా గాయపడ్డారు. కర్రలతో జరిగిన దాడిలో ఆలూరుకు చెందిన పోతురాజు (28) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన వారిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు దేవరగట్టులో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 1000 మంది పోలీసులు ఉన్నప్పటికీ కర్రల సమరాన్ని ఆపలేక నిస్సహాయ స్థితిలో ఉండి పోయారు.కర్నూలు జిల్లాలోని హోళగుంద మండలం దేవరగట్టు బన్నీ ఉత్సవంలో మరోసారి హింస చెలరేగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీ మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు సందర్భంగా నిర్వహించే బన్నీ ఉత్సవంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. నేరనికి, నేరనిక తండా, కొత్తపేట గ్రామస్తులు స్వామివారి ఉత్సవ మూర్తులను కొండపై నుంచి కిందికి తీసుకొస్తున్న సమయంలో ఆలూరు, అరికెర, ఎల్లార్తి తదితర గ్రామస్తులు కర్రలతో ఎదురుగా తలపడ్డారు. ఇది సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న ఉత్సవం అని భావించిన పోలీసులకు, వారి ఎదురుగానే రణరంగాన్ని తలపించే విధంగా దాడులు ప్రతిదాడులతో స్థానికులు రెచ్చిపోవడం కనిపించింది. లక్ష మంది వరకు ఆయా గ్రామస్తులు పాల్గొనగా, దాదాపు 30 వేల మంది కర్రల సమరంలో పాల్గొన్నారు.కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులను మోహరించినప్పటికీ, ఆ కర్రల సమరాన్ని నిలువరించలేకపోయారు. సంప్రదాయబద్ధంగా సాగే కర్రల సమరం కాస్త, ప్రతీకార దాడులగా మారడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పలు గ్రామస్తులు ఒకరిపై ఒకరు దివిటీలు ఉద్దేశపూర్వకంగా విసిరేసు కోవడంతో అనేక మంది మహిళలు గ్రామస్తులు, యువకులు గాయాలపాలయ్యారు. కొంతమంది పోలీసులు గాయపడ్డారు. దాదాపు రెండు గంటలపాటు రణరంగం కొనసాగింది. మరికొంత మంది కర్రల దాడిలో ఉద్దేశపూర్వకంగా కింద పడేసి కొట్టడం, తోపులాట, తొక్కిసలాట జరగడంతో పలువురు గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం మేరకు దాదాపు 100 మందికి పైగానే గాయపడినట్లు అంచనా.గాయపడిన వారందరినీ దేవరగట్టులోని ప్రాథమిక వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న వారిని అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ కర్రల సమరంలో ఆలూరు ప్రాంతానికి చెందిన పోతురాజు అనే వ్యక్తి ఊపిరాడక చనిపోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు. మరింత మందికి తీవ్ర గాయలయ్యాయి. కళ్ల ఎదుట కర్రల సమరం, రాళ్లదాడి జరుగుతున్నప్పటికీ తక్కువ మంది పోలీసులు ఉండడంతో నిస్సహాయ స్థితిలో జిల్లా ఎస్పీ ఉండిపోయారు."ఈ ఏడాది జరిగిన బన్ని ఉత్సవాల్లో చాలామంది తీవ్రంగా గాయపడ్డారు. ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గాయాలతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేశాం. వారిలో చాలామందికి చెవులు, ముక్కు లేదా తల నుంచి రక్తస్రావం అవుతోంది. ప్రథమ చికిత్స చేసిన తర్వాత, మెరుగైన వైద్యం కోసం వారిని ఆదోనికి తరలించాం".జిల్లా ఎస్పీ కంట్రోల్ రూమ్‌లో మైకుల ద్వారా హెచ్చరించినప్పటికీ, బన్నీ ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు లెక్క చేయలేదు. పరిస్థితి అదుపుతప్పి గతంలో లేని విధంగా పెద్ద సంఖ్యలో దివిటీలను గ్రామస్తులు ఒకరిపై ఒకరు విసిరేసుకోవడంతో పరిస్థితి మరింత చేయి దాటిపోయింది. చివరి నిమిషంలో గత్యంతరం లేక స్పెషల్ పార్టీ పోలీసులు హెల్మెట్లతో గుంపు మధ్యలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

# హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టిన జనం

**నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్**

**పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది ప్రజలు హైదరాబాద్ నగరానికి తిరిగి వస్తుండటం, నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది**



దసరా పండుగ ముగించుకొని సొంతూళ్ల నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రజలు నగరానికి తిరిగి వస్తుండటం, మరోవైపు నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో హైదరాబాద్ వ్యాప్తంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలకు విగ్రహాలు భారీగా తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ట్రాఫిక్‌లో తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఇవాళ ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు హైదరాబాద్‌లోని కీలక రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీన్ని నియంత్రించేందుకు విజయవాడ, నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి వస్తున్న ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులకు ఎంజీబీఎస్ వైపు వెళ్లొద్దని పోలీసులు సూచిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోనే దిగిపోవాలని ప్రయాణీకులకు స్పష్టం చేస్తున్నారు. అలాగే కూకట్‌పల్లి, మియాపూర్, పటాన్‌చెరు వైపు వెళ్లే బస్సులను మళ్లిస్తున్నారు. కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను ఉప్పల్, జేబీఎస్ మీదుగా వెళ్లాలని చెబుతున్నారు.వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో పరిస్థితిని అదుపు చేయడానికి కొన్ని చోట్ల ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా బస్సుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ట్రాఫిక్ పోలీసులు క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్నారు. అయినప్పటికీ దసరా సెలవుల ముగుంచుకొని నగరానికి వస్తున్న లక్షలాది మంది ప్రజలు ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ గందరగోళం తప్పడం లేదు. దీంతో సొంత ఊర్లలో పండుగను సంతోషంగా నిర్వహించుకొని, తిరిగి నగరంలో అడుగుపెట్టిన సామాన్యుడికి ఈ ట్రాఫిక్ కష్టాలు పెద్ద పరీక్షగా మారాయి. తీవ్రంగా రద్దీ నెలకొన్న ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ దారులను చూసుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

# వేగం మించితే వెంటనే చలానా

**పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై త్వరలో స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్!**

**పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై అతి త్వరలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు**

**దీంతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు పలు ప్రయోజనాలున్నాయి**



హైదరాబాద్ నగరం నుంచి నేరుగా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానించే పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై అతి త్వరలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిస్టమ్ (ఐటీఎస్) వ్యవస్థకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టనుంది. ఎప్పటి నుంచో ప్రతిపాదనల దశలోనే ఉన్న దీనికి తాజాగా ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వారం పదిరోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు సమాచారం.దాదాపు 11.63 కిలోమీటర్ల పొడవు, 4 లైన్లలో ఉన్న ఈ రహదారిపై పరిమితిని మించిన వేగం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ రహదారిపై ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టడంతో దాని వెనుక వచ్చే ఆరు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనకు అతివేగమే మూలకారణం అని తెలిసింది. నెలలో చిన్నాపెద్దవి కలిపి పదికిపైగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపైకి బైక్‌ల ప్రవేశాలకు నిషేధం ఉంది. పోలీసుల నిఘా కొరవడటంతో పోకిరీలు తరచూ బైక్‌లపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.ఈ నేపథ్యంలో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే రహదారి భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఐఐటీ హైదరాబాద్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ, అత్యాధునిక ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిస్టమ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్లు సమాచారం. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వరకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఇట్టే గుర్తించే విధంగా 29 ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉండే 19 ప్రాంతాల్లో అమర్చుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.ఇవి పీటీజడ్ (పాన్ టిల్ట్ జూమ్ సౌకర్యం)తో పనిచేస్తాయి. ట్రాఫిక్ కదలికలు ఎప్పటికప్పుడు, మరింత స్పష్టంగా లైవ్‌లో పరిశీలించేందుకు ఉపయోగపడతాయి.ఈ ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సాంకేతికతతో పనిచేస్తాయి. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనాలను క్షణాల్లో గుర్తించి ట్రాక్ చేస్తాయి.వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రత్యేక ప్రదర్శన బోర్డులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.వాహనాలకు సంబంధించిన లైవ్ స్పీడ్‌ను డిస్‌ప్లే చేస్తూ అతివేగంగా వెళ్లేవారికి హెచ్చరికగా నిలుస్తాయి.అత్యవసర ట్రాఫిక్ అలర్ట్స్, భద్రతా సందేశాలను వాహనదారులకు చేరవేసేందుకు ఉపయోగపడతాయి. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు వీలుగా పిల్లర్ నంబరు 164 వద్ద ఇప్పటికే ఉన్న కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయనున్నారు. ఈ వ్యవస్థ కోసం రూ.7 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.వీఎస్‌డీ బోర్డులు వల్ల వాహనాల ప్రత్యక్ష వేగాన్ని (లైవ్ స్పీడ్) చూపించడం వల్ల డ్రైవర్లు అప్రమత్తమై స్పీడ్‌ను తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.పీటీజెడ్ కెమెరాల సహాయంతో కంట్రోల్‌రూం నుంచి ట్రాఫిక్ కదలికలను ఎప్పటికప్పుడు, అత్యంత స్పష్టంగా లైవ్‌లో పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్కడైనా ట్రాఫిక్ రద్దీ, ప్రమాదం లాంటివి జరిగినా వెంటనే అప్రమత్తం అయ్యేందుకు అవకాశం ఉంటుంది.రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల నంబరు ప్లేట్లను ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఆటోమెటిక్‌గా గుర్తించి తక్షణమే సెల్‌ఫోన్‌కు చలానాలు పంపిస్తాయి.వీఎండీ బోర్డులతో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, రోడ్డు భద్రత సూచనలకు సంబంధించిన సమాచారాన్ని డ్రైవర్లకు ఎప్పటికప్పుడు చేరవేసేందుకు అవకాశం ఉంటుంది.

# కడప జిల్లాలో ఉద్రికత్త వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండోరోజూ గురువారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కడప జిల్లాలో ఇవాళ కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. బుధవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయానికి ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు ర్యాలీగా వచ్చిన వైఎస్సార్సీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లదాడి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.ముందస్తు చర్యల్లో భాగంగా వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మేయర్ పాకా సురేశ్ తదితరులను కడపలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పులివెందులలోని అవినాష్‌రెడ్డి నివాసానికి తరలించారు. అక్కడే గృహ నిర్బంధం చేశారు. చాపాడులో వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. నామినేషన్ పత్రాలు చించివేశారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు పెంచారు.జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామంలో రోడ్డుపై వాహనాలు అడ్డంగా పెట్టడంతో నామినేషన్లు వేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి వెళ్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆయన సతీమణి ఇందిరమ్మ రోడ్డుపై బైఠాయించారు.మరోవైపు ఒంటిమిట్టలో టీడీపీ-వైఎస్సార్సీపీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మండలంలోని ముఖ్యమైన టీడీపీ, వైఎస్సార్సీపీ నాయకులను వారి ఇళ్ల వద్ద పోలీసులు నిర్బంధించారు.జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు గుంపుగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో పోలీసు భద్రత మధ్య నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న వైఎస్సార్సీపీ అభ్యర్థులపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. వైఎస్సార్సీపీ శ్రేణులు తిరిగి రాళ్లు రువ్వడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.ఒంటిమిట్టలో టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. మండలంలోని ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలను వారి ఇళ్ల వద్దే నిర్బంధించారు.

# టీడీపీ సీనియర్ నేత యనమలకు అస్వస్థత

**కాకినాడ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స**

**మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అస్వస్థతకు గురయ్యారు**

**కాకినాడలోని ట్రస్ట్ ఆసుపత్రిలో ఆయనకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు**



టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అనారోగ్యానికి గురయ్యారు. గురువారం ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కాకినాడలోని ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల బృందం ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తోంది. యనమల రామకృష్ణుడు వయసు దృష్ట్యా నిపుణులైన డాక్టర్లు ఆయనకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ట్రస్ట్ ఆసుపత్రి వైద్యులతో ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. యనమల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, ఆయనకు ఎలాంటి చికిత్స అందిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం యనమల కుటుంబ సభ్యులతోనూ సీఎం మాట్లాడి ధైర్యం చెప్పారు. యనమల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని స్థానిక పార్టీ నేతలను ముఖ్యమంత్రి ఆదేశించారు.రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సైతం యనమల రామకృష్ణుడి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ట్రస్ట్ ఆసుపత్రి వైద్యులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. యనమలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లతో మాట్లాడారు. ఆయన త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు హుటాహుటిన కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రికి చేరుకున్నారు. యనమల ఆరోగ్య పరిస్థితిని ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. డాక్టర్లతో మాట్లాడి ఆయనకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ సీనియర్ నేత అస్వస్థతకు గురికావడంతో టీడీపీ శ్రేణుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు, కార్యకర్తలు ప్రార్థిస్తున్నారు.

# లంచావతారులకు ఏసీబీ షాక్

**సాంకేతిక ఆధారాలతో డెడ్‌డ్రాప్ పద్ధతికి చెక్**

**డెడ్‌డ్రాప్ పద్ధతి ద్వారా అవినీతికి పాల్పడుతున్న అధికారులకు ఏసీబీ షాకిస్తోంది**

**ఇన్నాళ్లు తప్పించుకున్నా ఇప్పుడు సాంకేతిక ఆధారాలతో వారికి చెక్ పెడుతోంది**

**డెడ్‌డ్రాప్ పద్ధతిని ఫాలో అవుతున్న లంచావతారులకు ఏసీబీ చెక్**



రక్షణ కల్పించాల్సిన అధికారులే ఈరోజుల్లో లంచాలకు అలవాటు పడుతున్నారు. ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ప్రాధాన్యం ఇస్తామని అంటున్నారు. ఇలాంటి వారిని ఏసీబీ ఎప్పటికప్పుడు కనిపెడుతూనే ఉంది. అయినా సరే అవినీతిపరులు మరింత తెలివిగా వ్యవహరిస్తున్నారు. డెడ్‌డ్రాప్ పద్ధతిని ఉపయోగించి ఏసీబీని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే అవినీతి నిరోధక శాఖ అధికారులు సాంకేతికతను ఉపయోగించి వారి ఆటలకు చెక్ పెడుతున్నారు.ఇటీవల టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత బాధితురాలి నుంచి రూ. 4 లక్షల లంచాన్ని నేరుగా తీసుకోకుండా స్కూటీ డిక్కీలో పెట్టమని సూచించింది. ఏసీబీ ఆమెను పట్టుకున్నప్పుడు తాను ఆ డబ్బును ముట్టుకోలేదని, అది స్కూటీ డిక్కీలోకి ఎలా వచ్చిందో తనకు తెలియదని అబద్ధం చెప్పింది. ఆమె లంచం డిమాండ్ చేసిందనడానికి అప్పటికే ఆధారాలు సేకరించిన పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.సాధారణంగా డెడ్‌డ్రాప్ అంటే ముందుగా నిర్ణయించిన రహస్య ప్రదేశంలో ఇద్దరు వ్యక్తుల మధ్య సమాచారం లేదా వస్తువులను ఇచ్చిపుచ్చుకోవడం. డ్రగ్స్ సరఫరాలో జరుగుతున్న ఈ వ్యవహారాన్ని అనుసరించి కొంతమంది అవినీతి అధికారులు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్-ఇన్‌స్పెక్టర్ కిరణ్ నందిత, కానిస్టేబుల్ విజయ్‌లు ఇలాంటి ప్రయత్నంలోనే పట్టుబడ్డారు.తమ సహాయం కోరిన బాధితులకు ఏసీబీ అధికారులు ఫినాఫ్తలిన్ పౌడర్ పూసిన నోట్లను అందజేస్తున్నారు. లంచంగా తీసుకునే అవినీతి అధికారుల చేతులకు ఆ పొడి అంటుకుంటుంది. ఆ తర్వాత వారి చేతులను సోడియం కార్బోనేట్ ద్రావణంలో ముంచితే అవి గులాబీ రంగులోకి మారతాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులంతా డెడ్‌డ్రాప్ పద్ధతిని ఎంచుకుంటున్నారు. లంచం డబ్బును చేతులతో తాకకపోతే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడలేమని కొందరు భావిస్తున్నారు.లంచం డబ్బును నేరుగా తీసుకోకుండా తప్పించుకోలేరని ఏసీబీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వారు ముందుగా సేకరించిన శాస్త్రీయ ఆధారాలను పరిస్థితుల ఆధారిత సాక్ష్యంగా ఉపయోగిస్తారు. నేరస్థులు లంచాలు డిమాండ్ చేస్తున్నప్పుడు వారు రహస్య కెమెరాలతో ఆడియో అలాగే వీడియో సాక్ష్యాలను సేకరిస్తున్నారు. అలా పోలీసులు అవినీతి అధికారుల ఎత్తుగడలను భగ్నం చేస్తున్నారు.

# యాదాద్రి థర్మల్ ప్లాంట్: గ్రిడ్‌కు అనుసంధానమైన చివరి యూనిట్




తెలంగాణ విద్యుత్ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదో యూనిట్‌ను బుధవారం విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానించారు. దీంతో 4,000 మెగావాట్ల మొత్తం సామర్థ్యంతో తలపెట్టిన ఈ భారీ ప్రాజెక్టులోని ఐదు యూనిట్ల ప్రక్రియ పూర్తయినట్లయింది.ఈ యూనిట్‌ను గ్రిడ్‌కు సింక్రనైజ్ చేసినట్లు తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీశ్ వెల్లడించారు. ఈ ఘనత సాధించినందుకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), జెన్‌కో బృందాలను ఆయన అభినందించారు. వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన తదుపరి పరీక్షల నిమిత్తం, సింక్రనైజ్ చేసిన వెంటనే యూనిట్‌ను హ్యాండ్-ట్రిప్ చేశారు. త్వరలోనే ఈ యూనిట్‌లో పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది.ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. సాధారణంగా అక్టోబర్‌లో 15,000 మెగావాట్లుగా ఉండే డిమాండ్, ప్రస్తుతం వ్యవసాయ పంపుసెట్లు, పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా 20,003 మెగావాట్లకు చేరింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఐదో యూనిట్ అందుబాటులోకి రావడం జెన్‌కోకు పెద్ద ఊరటనిస్తోంది.కాగా, బొగ్గు గనులకు దూరంగా ఈ ప్లాంట్‌ను నిర్మించడంపై డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. దీనివల్ల బొగ్గు రవాణాకే అదనంగా రూ. 40,000 కోట్ల భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల మార్గనిర్దేశంలోనే ఈ విజయం సాధ్యమైందని అధికారులు తెలిపారు.

# మెటాకు అమెరికా కోర్టు బిగ్ షాక్- 2.3 లక్షల కోట్ల భారీ జరిమానా

**వినియోగదారుల గోప్యత విషయంలో వారిని మోసగించినందుకు ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు అమెరికాలోని న్యూమెక్సికో కోర్టు పెద్ద షాక్ ఇచ్చింది**




టెక్ దిగ్గజం మెటాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. న్యూ మెక్సికోలోని ఒక కోర్టు, ఈ సంస్థపై 25 బిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.2.3 లక్షల కోట్లు జరిమానా విధించింది. వినియోగదారుల డేటా గోప్యతకు సంబంధించి వారిని తప్పుదోవ పట్టించినందుకు మెటా దోషిగా తేలిందని కోర్టు పేర్కొంటూ, ఈ జరిమానా మొత్తాన్ని న్యూ మెక్సికో రాష్ట్రానికి చెల్లించాలని ఆదేశించింది. అమెరికా చరిత్రలో ఒక సంస్థపై విధించిన అతిపెద్ద జరిమానాలలో ఇది ఒకటిగా నిలిచింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో, 'కేంబ్రిడ్జ్ అనలిటికా' అనే బ్రిటీష్ కన్సల్టింగ్ సంస్థ, లక్షలాది మంది ఫేస్‌బుక్ వినియోగదారుల డేటాను సేకరించి, దానిని రాజకీయ ప్రచారాల కోసం దుర్వినియోగం చేసిందనేది ప్రధాన ఆరోపణ. వినియోగదారుల అనుమతి లేకుండానే ఈ డేటాను సేకరించడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ విషయం సదరు సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి ద్వారా వెలుగులోకి వచ్చింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలే కాకుండా, బ్రెగ్జిట్ (దీతీవఇఅ) ప్రజాభిప్రాయ సేకరణలోనూ, అలాగే భారత్, కెన్యా, నైజీరియాలలో జరిగిన ఎన్నికలలోనూ ఈ సంస్థ జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. 2021లో, న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రావుల్ టోర్రెజ్, డేటా ఉల్లంఘనలకు సంబంధించి మెటాపై దావా వేశారు. వినియోగదారుల డేటా ఎవరికి అందుబాటులోకి వస్తుందనే విషయంలో మెటా నిజం చెప్పలేదని ఆయన ఆరోపించారు. ఈ కేసులో మెటాకు 219 బిలియన్ డాలర్ల వరకు జరిమానా పడే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, న్యాయమూర్తి ఆ మొత్తాన్ని 25 బిలియన్ డాలర్లకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చారు. ఇదే 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వ్యవహారంలో, గతంలో 2019లో అమెరికా ఫెడరల్ ట్రేడ్ కమిషన్ మెటాకు 5 బిలియన్ డాలర్ల జరిమానా విధించింది. తాజా జరిమానాపై మెటా స్పందించింది. ఈ అప్పీలులో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. ఈ తీర్పు వల్ల న్యూ మెక్సికో రాష్ట్రంలో వ్యాపారం నిర్వహించడం చాలా కష్టతరమవుతుందని కంపెనీ పేర్కొంది. సుమారు 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మెటాకు, ఈ జరిమానా పెద్ద మొత్తమే అయినప్పటికీ, కంపెనీ మొత్తం విలువపై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాకుండా, అప్పీలు ప్రక్రియ ద్వారా ఈ కేసు మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కాగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ వినియోగదారులకు వార్తలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని ఎలా అందిస్తున్నాయనే దానిపై భారత ప్రభుత్వం ఇటీవల దృష్టి సారించింది. ముఖ్యంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాతృ సంస్థ అయిన మెటా ప్లాట్‌ఫారమ్స్‌ను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. సోషల్ మీడియా సిఫార్సు వ్యవస్థలు (కంటెంట్‌ను సూచించడానికి ఉపయోగించే యంత్రాంగాలు) వినియోగదారులకు కేవలం ఒక రకమైన కంటెంట్‌ను లేదా పరిమిత శ్రేణి కథనాలను మాత్రమే అసమానంగా ప్రదర్శించకూడదని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అటువంటి కంటెంట్‌కు అనవసరమైన ప్రాధాన్యత ఇవ్వకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ కంపెనీని ఆదేశించింది. అంతేకాకుండా, శాంతిభద్రతలకు భంగం కలిగించే, హింసను ప్రేరేపించే, లేదా ప్రజలలో గందరగోళం లేదా అశాంతికి కారణమయ్యే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దారితీసే కంటెంట్‌పై పర్యవేక్షణను పెంచాలని మంత్రిత్వ శాఖ కోరింది. ఈ మేరకు అక్టోబర్ 10న మెటాకు ఒక అధికారిక సలహా జారీ చేసింది. అలాగే ఫోటోలు, వీడియోలు లేదా గ్రాఫిక్స్ వంటి సమాచారాన్ని సమర్పించేటప్పుడు, వాటి వెనుక ఉన్న సందర్భాన్ని కూడా వివరించాలని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒక వీడియో లేదా ఫోటో ఎప్పుడు, ఎక్కడ తీశారో లేదా దానికి సంబంధించిన పరిస్థితులు ఏమిటో వినియోగదారులకు స్పష్టంగా తెలియని సందర్భాల్లో, పూర్తి వివరాలను అందించాలని ప్రత్యేకంగా సూచించింది.

# వరుసగా రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**2 శాతానికి పైగా పడిపోయిన స్మాల్‌క్యాప్ షేర్లు**

**143.21 పాయింట్లు తగ్గి 73,709.69 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**77.60 పాయింట్లు పతనమై 22,811.35కు చేరిన నిఫ్టీ**

**నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.37 శాతం క్షీణత**

**మిడ్‌క్యాప్ సూచీ 1.58 శాతం నష్టం**

**ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, ఐటీ రంగం మెరుగైన పనితీరు**



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిశాయి. ఆటో, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, కొన్ని భారీ కంపెనీల షేర్ల పతనం సూచీలను కిందకు లాగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో నష్టాలు ఎక్కువగా నమోదయ్యాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 143.21 పాయింట్లు నష్టపోయి 73,709.69 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 77.60 పాయింట్లు తగ్గి 22,811.35 వద్ద ముగిసింది. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, బీఎస్ఈ లిమిటెడ్, ఎటర్నల్ షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. విస్తృత మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.58 శాతం పడిపోగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.37 శాతం క్షీణించింది. రంగాలవారీగా చూస్తే కెమికల్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ రంగం మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే మెరుగైన పనితీరు కనబరిచి లాభాల్లో నిలిచింది. మార్కెట్లలో స్వల్పకాలిక దిశపై విశ్లేషకులు అప్రమత్తత వ్యక్తం చేశారు. నిఫ్టీ 23,000 పాయింట్ల స్థాయిని నిలకడగా దాటితేనే స్వల్పకాలిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ స్థాయిని తిరిగి అందుకోలేకపోతే మరింత పతనం ఉండొచ్చని హెచ్చరించారు. దిగువన 22,650-22,600 పాయింట్ల పరిధిని తక్షణ మద్దతు స్థాయిగా, ఆ తర్వాత 22,300 పాయింట్లను కీలక స్థాయిగా గుర్తించారు. 22,600 కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందన్నారు. కంపెనీల ఆర్థిక ఫలితాలు, వాణిజ్య చర్చల్లో పురోగతి, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ తదుపరి దిశను ప్రభావితం చేయనున్నాయని విశ్లేషకులు తెలిపారు. ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ల రాబడులు, కరెన్సీ విలువల్లో ఒడుదొడుకులు తగ్గడం కూడా మార్కెట్ స్థిరత్వానికి కీలకమని పేర్కొన్నారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్

**ఇద్దరు కీలక అధికారులపై విచారణ!**

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇద్దరు సీనియర్ అధికారులపై విచారణ**

**రహస్య వ్యాపార సమాచారం బయటకు చేరవేసినట్లు అనుమానాలు**

**సమాచారం దుర్వినియోగంపై కొనసాగుతోన్న దర్యాప్తు**

**విచారణ వివరాలను ఉన్నతాధికారులకు ఇప్పటికే వెల్లడి**

**విచారణ పూర్తయ్యాక చర్యలు తీసుకుంటామని బ్యాంకు ప్రకటన**




దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కీలక సమాచారం బయటకు వెళ్లినట్లు అంతర్గత విచారణలో వెల్లడైంది. బ్యాంకుకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు వ్యాపార వ్యూహాలు, మార్కెట్‌పై ప్రభావం చూపగల సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. బ్యాంకులోని కొన్ని కీలక విభాగాలకు బాధ్యత వహిస్తున్న ఈ అధికారులపై అనుమానాలు రావడంతో అంతర్గత విచారణ ప్రారంభించారు. సమాచారం దుర్వినియోగమైందా? దాని వల్ల బ్యాంకుకు లేదా మార్కెట్‌కు ఏమైనా నష్టం జరిగిందా? అనే అంశాలపై పరిశీలిస్తున్నారు. విచారణలో గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులతో పాటు బోర్డులోని కొందరు సభ్యులకు ఈ ఏడాది ప్రారంభంలోనే తెలియజేసినట్లు సమాచారం. సంబంధిత అధికారులకు కూడా విచారణ వివరాలు అధికారికంగా తెలిపినట్లు తెలుస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి అంతర్గత విచారణ జరుగుతున్న విషయాన్ని ధ్రువీకరించారు. అయితే, విచారణలో వెల్లడైన అంశాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరాలపై స్పందించలేదు. విచారణ పూర్తయ్యాక వెల్లడయ్యే అంశాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైతిక విలువలు, పాలనా ప్రమాణాల విషయంలో రాజీ పడబోమని బ్యాంకు స్పష్టం చేసింది. ఈ పరిణామం బ్యాంకుకు కీలకమైన సమయంలో చోటుచేసుకుంది. ఈ నెల 27న అనూప్ బాగ్చీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రత్యర్థి ఐసీఐసీఐ గ్రూపులో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు ఈ పరిణామాలు సవాలుగా మారే అవకాశముంది. ఇటీవల బ్యాంకులో ఉన్నతస్థాయి మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. మార్చిలో అప్పటి ఛైర్మన్ చక్రవర్తి వ్యక్తిగత విలువలకు, బ్యాంకులోని కొన్ని విధానాలకు మధ్య విభేదాలున్నాయని పేర్కొంటూ రాజీనామా చేశారు. అయితే, ఆందోళనలకు ఆధారాలు లేవని బ్యాంకు నియమించిన స్వతంత్ర న్యాయ సమీక్ష తెలిపింది. ప్రస్తుత సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపలేదు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ భరూచా కూడా డిసెంబరు చివర్లో వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

# బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ముందడుగు

**భారత్ బయోటెక్ అనుబంధ సంస్థతో వీజెన్ బయో భాగస్వామ్యం!**

**ప్రముఖ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ సబ్సిడరీ న్యూసిలియన్ థెరప్యూటిక్స్,**

**హైదరాబాద్‌కు చెందిన వీజెన్ బయోతో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది**

**బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ఇది కీలక పరిణామంగా మారనుంది**




బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో కొత్త తరహా కణ చికిత్సను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన రెండు సంస్థలు చేతులు కలిపాయి. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ సబ్సిడరీ న్యూసిలియన్ థెరప్యూటిక్స్- ప్రిసిషన్ ఆంకాలజీ రంగంలో పనిచేస్తున్న వీజెన్ బయోతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేసే లక్ష్యంతో రెండు సంస్థలు అక్టోబర్ 21న ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. మల్టిపుల్ మైలోమా అనే బ్లడ్ క్యాన్సర్ చికిత్స కోసం అభివృద్ధి చేస్తున్న ఞూ- 2511 అనే థెరపీని తయారు చేయడం, క్లినికల్ పరీక్షలు, భవిష్యత్తులో కమర్షియల్ ప్రొడక్షన్ దిశగా ముందుకు తీసుకెళ్లడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఈ థెరపీ కింద భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఫేజ్ 1/2 క్లినికల్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఇక్కడ ఫేజ్ 1/2 క్లినికల్ ట్రయల్స్ అంటే ఒకదాని తర్వాత ఒకటి కాకుండా మొదటి దశ, రెండో దశ ప్రయోగాల్ని ఒకేసారి నిర్వహించే అత్యాధునిక క్లినికల్ ట్రయల్ పద్ధతి అని చెప్పొచ్చు. ఈ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా ఈ చికిత్సా విధానాన్ని విజయవంతంగా పూర్తి చేసి, 2028 నాటికి మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇందుకు అవసరమైన క్లినికల్ పరీక్షలు, నియంత్రణ సంస్థల అనుమతులు పూర్తి కావాల్సి ఉంటుంది. సాధారణంగా క్యాన్సర్ చికిత్సలో మందులు, కీమోథెరపీ, రేడియేషన్ వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. కానీ కింద రోగి శరీరంలోని రోగనిరోధక కణాలనే, క్యాన్సర్ కణాలను గుర్తించి దాడి చేసేలా మార్చి ఉపయోగించే ప్రత్యేక చికిత్సా విధానం. ఈ ప్రాసెస్‌లో రోగి నుంచి ు- సెల్స్ సేకరించి, క్యాన్సర్ కణాల్ని గుర్తించేలా జన్యు మార్పులు చేస్తారు. అనంతరం ఆ కణాల్ని ప్రత్యేక పరిస్థితుల్లో రూపొందించి, తిరిగి రోగి శరీరంలో ప్రవేశపెడతారు. ఈ విధానం ద్వారా క్యాన్సర్ కణాల్ని లక్ష్యంగా చేసుకోవడం సాధ్యం అవుతుంది. వీజెన్ బయో అభివృద్ధి చేస్తున్న ఞూ- 2511 ఒక ఆటోలోగస్ డ్యూయెల్ టార్గెట్ థెరపీ. దీంట్లో ఆటోలోగస్ అనేది రోగి నుంచి సేకరించిన కణాల్ని ఉపయోగించడం. డ్యూయెల్ టార్గెట్ అంటే క్యాన్సర్ కణాలపై ఉండే రెండు ప్రత్యేక లక్ష్యాల్ని గుర్తించేలా ఈ చికిత్సను రూపొందించడం. ఇక్కడ క్యాన్సర్ కణాలలోని దీజహీూ, జణ19 ను లక్ష్యంగా చేసుకుంటుంది. దీని వల్ల క్యాన్సర్ కణాలు శరీర రోగనిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకునే సామర్థ్యాన్ని కోల్పోతాయి. ఇప్పటికే చైనాలో క్లినికల్ అనుభవాన్ని సంపాదించగా, ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న క్లినికల్ ట్రయల్స్ ద్వారా ఞూ-2511 థెరపీ అత్యుత్తమ ఫలితాలు ఇస్తున్నట్లు ఈ సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా శరీరంలోని ఇతర అవయవాలకు పాకే ఎక్స్‌ట్రామెడుల్లరీ క్యాన్సర్ ఉన్న రోగుల్లో ఆశాజనకమైన ఫలితాలు కనిపించినట్లు కంపెనీ తెలిపింది. ఇంకా ఇది రోగులకు సురక్షితమైనదని, ఈ థెరపీని తక్కువ ఖర్చుతో, భారీ స్థాయిలో తయారు చేసే వీలుండటం వల్ల భారతదేశంలో క్యాన్సర్ రోగులకు ఈ అత్యాధునిక చికిత్సను చాలా తక్కువ ధరకే, సులభంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నాయి. "క్యాన్సర్ బాధితులకు కొత్త ఆశలు చిగురింపజేయడమే మా లక్ష్యం. న్యూసిలియన్ అంతర్జాతీయ స్థాయి తయారీ మౌలిక వసతులు, మా పరిశోధనా సామర్థ్యాలు జతకలవడం వల్ల భారతీయులకు తక్కువ ఖర్చులోనే అడ్వాన్స్‌డ్ జీన్ థెరపీలు అందనున్నాయి. సంస్థల ఒప్పందం ప్రకారం 2511 కు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం, తయారీ ప్రక్రియ, క్లినికల్ పరీక్షలకు అవసరమైన ఉత్పత్తిని తయారు చేయడం, భవిష్యత్తులో వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేయడం వంటి బాధ్యతల్ని న్యూసిలియన్ చేపడుతుంది. ఉత్పత్తి విధానాల్ని మెరుగుపర్చడం, తయారీలో వీలైనంతగా నష్టాల్ని తగ్గించడం, ఒకే నాణ్యతతో ఉత్పత్తుల్ని తయారు చేయడం ద్వారా ఖర్చుల్ని తగ్గించాలని రెండు సంస్థలు భావిస్తున్నాయి. 2511 ను మల్టిపుల్ మైలోమాతో పాటు ౣాజుమీూ సిండ్రోమ్, సిస్టమిక్ లూపస్ ఎరిథిమాటోసస్ వంటి కొన్ని ఆటోఇమ్యూన్ వ్యాధుల కోసం కూడా పరిశీలిస్తున్నట్లు వీజెన్ బయో తెలిపింది. ఇక్కడ వీజెన్ బయోకు సొంతంగా భారీ తయారీ కేంద్రాన్ని నిర్మించాల్సిన అవసరం తగ్గుతుంది. దీంతో పరిశోధన, కొత్త చికిత్సల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టొచ్చు. ఇక న్యూసిలియన్‌కు మాత్రం  వంటి అధునాతన కణ ఆధారిత చికిత్సల తయారీ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది.

# అమెజాన్ ఉన్నతాధికారిపై రేప్ ఆరోపణలు

**ఫిర్యాదు చేసిన ఉద్యోగినిని మౌనంగా ఉండాలని కంపెనీ ఒత్తిడి?**

**అమెజాన్‌పై ఉద్యోగిని లారా డాన్‌బోమ్ దావా**

**2023లో న్యూయార్క్ పర్యటనలో అత్యాచారం జరిగిందని ఆరోపణ**

**ఉన్నతాధికారి మైకెలాంజెలో సిమోంటేపై ఆరోపణలు**

**ఫిర్యాదుపై కంపెనీ సమగ్ర విచారణ జరపలేదన్న లారా**

**ఆఫీసులో ఆరోపణల గురించి మాట్లాడకుండా ఒత్తిడి తెచ్చారని ఆరోపణ**




అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌పై ఓ ఉద్యోగిని సంచలన ఆరోపణలు చేశారు. సంస్థలో ఉన్నత హోదాలో పనిచేస్తున్న అధికారి తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దీనిపై కంపెనీకి తెలియజేసినా సమగ్ర విచారణ జరపలేదని, ఘటన గురించి బయట మాట్లాడకుండా తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు న్యూయార్క్ పోస్ట్, సియాటిల్ టైమ్స్ వార్తా కథనాలు ప్రచురించాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్)లో మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న లారా డాన్‌బోమ్ ఈ దావా వేశారు. 2023 అక్టోబరు 27న పని నిమిత్తం న్యూయార్క్ వెళ్లిన సమయంలో సంస్థలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న మైకెలాంజెలో సిమోంటే తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సిమోంటే మాడ్రిడ్‌లో పనిచేస్తున్న అడ్వర్టైజ్‌మెంట్ విభాగం అధికారి అని పేర్కొన్నారు. దావాలో పేర్కొన్న వివరాల ప్రకారం.. లారా, సిమోంటే సహా పలువురు సహోద్యోగులు న్యూయార్క్‌లో అమెజాన్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి కరావోకే బార్‌లకు వెళ్లారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చులను కంపెనీయే భరించింది. ఆ పర్యటనలోనే తనపై అత్యాచారం జరిగిందని లారా ఆరోపించారు. ఘటనపై ఫిర్యాదు చేసిన తర్వాత అమెజాన్ తనకు సరైన న్యాయం చేయలేదని లారా పేర్కొన్నారు. ఆరోపణల గురించి ఆఫీసులో మాట్లాడకూడదని చెప్పడంతో పాటు, తాను ఆరోపించిన అధికారితో వృత్తిపరమైన సంబంధాలు కొనసాగించాల్సిన పరిస్థితి కల్పించారని దావాలో తెలిపారు. దీనివల్ల ఆఫీసులో తనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని ఆరోపించారు. ఉద్యోగులపై వేధింపులు, వివక్ష, లైంగిక దాడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడకుండా అడ్డుకోవడాన్ని పరిమితం చేసే వాషింగ్టన్ రాష్ట్ర చట్టాన్ని కూడా కంపెనీ ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఘటన జరిగిన కొన్ని రోజులకే పోలీసులు తనను విచారించారని, డీఎన్ఏ ఆధారాలున్న కండోమ్‌ను అందజేశానని లారా తెలిపారు. అయితే, ఆ ఆధారాలను సిమోంటే డీఎన్ఏ నమూనాతో పోల్చేందుకు పోలీసులు చర్యలు తీసుకోలేదని దావాలో ఆరోపించారు. కంపెనీ కూడా ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపలేదని ఆమె తరఫు న్యాయవాది జే ఫ్రీ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కోర్టులో ఇంకా విచారణ పూర్తికాలేదు.

# తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన.. 2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్

**మొత్తం ఇష్యూ విలువ రూ.30,213 కోట్లు**

**క్యూఐబీ విభాగానికి 7.46 రెట్ల స్పందన**

**సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగం 1.32 రెట్లు సబ్‌స్క్రైబ్**

**రిటైల్ విభాగం 60 శాతమే సబ్‌స్క్రైబ్**

**అక్టోబర్ 23తో ముగియనున్న ఐపీఓ; 28న లిస్టింగ్ అవకాశం**




జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. రూ.30,213 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఇష్యూకు బుధవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయానికి 2.5 రెట్ల బిడ్లు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా నిలిచిన ఈ ఐపీఓ అక్టోబర్ 23 వరకు అందుబాటులో ఉంటుంది. బీఎస్ఈ గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లో 19.75 కోట్ల షేర్లు ఉండగా, 49.56 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అత్యధిక స్పందన వచ్చింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) విభాగం 7.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగానికి 1.32 రెట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ పెట్టుబడిదారుల విభాగం మాత్రం 60 శాతమే సబ్‌స్క్రైబ్ అయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం కేటాయించిన విభాగం 1.16 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో అందుబాటులో ఉన్న 2.23 కోట్ల షేర్లకు గానూ 2.59 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. ఉద్యోగుల కోసం కేటాయించిన విభాగం కూడా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓకు ముందు జియో ప్లాట్‌ఫామ్స్ 212 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,109.84 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ సహా పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ, నిప్పాన్ ఇండియా వంటి దేశీయ సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి. ఒక్కో షేరు ధరను రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య నిర్ణయించారు. ఈ ఆఫర్‌లో గరిష్ఠంగా 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనున్నారు. అక్టోబర్ 26 నాటికి షేర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అక్టోబర్ 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యే అవకాశం ఉంది.

# కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ వచ్చేసింది



బజాజ్ ఆటో భారత మార్కెట్లో కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ.1,59,406గా నిర్ణయించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న పల్సర్ ఎన్250కి అప్‌డేటెడ్ వెర్షన్‌గా దీన్ని తీసుకొచ్చింది. ఇంజిన్, గేర్‌బాక్స్, డిస్‌ప్లే సహా పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా 6-స్పీడ్ గేర్‌బాక్స్, క్విక్‌షిఫ్టర్, 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్ వంటి ఫీచర్లు కొత్త బైక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. డిజైన్ పరంగా పల్సర్ కుటుంబానికి చెందిన స్పోర్టీ రూపాన్ని కొనసాగించింది. బాడీపై పదునైన గీతలు, కొత్త పెయింట్ ఆప్షన్లు, తాజా గ్రాఫిక్స్ అందించారు. హెడ్‌ల్యాంప్ డిజైన్ మాత్రం సాధారణ ఎన్250 మోడల్‌కు దగ్గరగా ఉంది. ఇంజిన్ విషయానికి వస్తే.. ఇందులో 249 సీసీ ఎయిర్-కూల్డ్, ఆయిల్-కూల్డ్ ఇంజిన్‌ను అప్‌డేట్ చేశారు. నాలుగు వాల్వ్‌లతో పనిచేసే ఈ ఇంజిన్ 25 హెచ్‌పీ పవర్, 22 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సాధారణ ఎన్250లో 24.5 హెచ్‌పీ పవర్, 21.5 ఎన్ఎం టార్క్ లభిస్తాయి. అంటే కొత్త మోడల్‌లో స్వల్పంగా పవర్, టార్క్ పెరిగాయి. పాత 5-స్పీడ్ గేర్‌బాక్స్ స్థానంలో 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను ఇచ్చారు. క్లచ్ ఉ ప యో గి ంచకుండా గేర్లు పెంచేందుకు వీలుగా స్పోర్ట్స్ షిఫ్టర్ ఫీచర్‌ను కూడా స్టాండర్డ్‌గా అందించారు. ఫీచర్ల పరంగా కొత్త బైక్‌లో ఎలక్ట్రానిక్ థ్రాటిల్ బాడీని ప్రవేశపెట్టారు. ఇది ఏబీఎస్ మోడ్‌లతో కలిసి రైడింగ్ మోడ్‌లకు మద్దతు ఇస్తుంది. అయితే, ఆయా మోడ్‌ల పూర్తి వివరాలను కంపెనీ వెల్లడించలేదు. పాత ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయం ఉన్న 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్‌ను ఇచ్చారు. ఇందులో ల్యాప్ టైమర్, వాహన పత్రాలను భద్రపరిచే సదుపాయం కూడా ఉంది. అడ్జస్టబుల్ లివర్లు, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, హజార్డ్ స్విచ్, అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు హెచ్చరించే పానిక్ బ్రేక్ అలర్ట్ ఫీచర్లను జోడించారు. సాధారణ పల్సర్ ఎన్250తో పోలిస్తే ఈ కొత్త మోడల్ ధర రూ.14,000 ఎక్కువ.

## భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్

చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర?ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలివారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది. దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పానం' ను విడుదల చేశారు. ఐదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన జంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు.భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు.

సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. అనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి.

పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును జోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి





## 'ఆది రుద్ర' సినిమా పోస్టర్ మోషన్ వీడియో రిలీజ్

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రంతో ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. దైవిక , అతీంద్రియ రహస్యాలు, ఉత్కంఠభరితమైన సస్పెన్స్ కలగలిసిన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రశాంత్ జి. రుద్రప్ప నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటిస్తూ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ త్రిశూలం పట్టుకుని, వెనక్కి తిరిగి నిలబడిన తీరు ఆకట్టుకుంటోంది. లో యాంగిల్‌లో రూపొందించిన ఈ కంపోజిషన్ ఆయన ఇంటెన్స్ ప్రజెన్స్ మరింత ప్రభావవంతంగా చూపిస్తోంది. ఆకాశాన్ని తాకేలా కనిపించే భారీ పర్వతాకార నిర్మాణంపై దుర్గామాత రూపం దర్శనమిస్తోంది. మరోవైపు, వెలుగుతున్న కాగడాలు పట్టుకున్న భారీ జనసమూహం వృత్తాకారంలో ఉన్న యజ్ఞస్థలాన్ని చుట్టుముట్టిన దృశ్యాలు పోస్టర్‌కు మరింత మిస్టరీని జోడిస్తున్నాయి. మనిషికి, అతీంద్రియ ప్రపంచం పథ్యంలో ఈ కథ సాగనుందనే ఆసక్తిని ఈ విజువల్స్ కలిగిస్తున్నాయి. 1960ల నుంచి 1990ల మధ్య కాలంలో జరిగే కథతో 'ఆది రుద్ర' తెరకెక్కుతోంది. ఈ ప్రత్యేకమైన పీరియడ్ నేపథ్యం సినిమాలోని పాత్రలు, విజువల్ స్టైల్, ఆ కాలం నాటి వాతావరణాన్ని మళ్లీ సృష్టిస్తూ, ఆసక్తికరమైన దైవిక రహస్యాన్ని మిళితం చేసి ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనేది మేకర్స్ లక్ష్యం. ఈ చిత్రానికి ఏజే శెట్టి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', తమిళ బ్లాక్‌బస్టర్ 'మహారాజా' చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మోషన్ వీడియోకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ డివైన్ వైబ్ ను అద్భుతంగా ఆవిష్కరిస్తోంది.






## 30న వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

అగ్ర హీరో వెంకటేష్ అంటేనే కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు ఇరవైఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఆదర్శ కుటుంబం-హౌస్ నంబర్ 47 (ఏకే 47)'. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ కలబోతగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సంపూర్ణ వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

## దుష్ట శిక్షణలో కనకదుర్గ

నిధి అన్వేషణ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ'. లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణీందర్ దర్శకుడు. దసరా సందర్భంగా ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్ విడుదల చేశారు. ఇందులో నటి లయ అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, దుష్టశిక్షణ గావించే అమ్మవారి అవతారంలో లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: శశిధర్ లంక, కథ: కాకర్ల గోవర్ధన రావు, నిర్మాతలు: వాణి శంకర్, తిలోత్తమ, దర్శకత్వం: దుర్గ ఫణీందర్ లంక.



PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040